
ప్రజాశక్తి

శనివారం జనవరి 3 2026 పేజీలు 12



విజయనగరం



పార్వతీపురం మన్యం

కబ్జాల చెరలో జిల్లా కేంద్రం

జిల్లా హోదా కల్పించడమే శాపమా?

పదుల సంఖ్యలో చెరువుల దురాక్రమణ

పాలక పక్షాల అండతోనే భూముల దందా

రెవెన్యూ అధికారుల పాత్రపై అనుమానాలు



బెలగాం రైల్వేగేటు సమీపాన కోనేరును ఆక్రమించి నిర్మించిన అపార్ట్‌మెంట్లు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా కేంద్రంలో ప్రభుత్వ చెరువుల కబ్జాల పర్వం కొనసాగుతోంది. గత ఏడేళ్లుగా పట్టణంలో భూ బాగోతం యథేచ్ఛగా సాగుతోంది. కంచే చేను మేసిన చందంగా ప్రభుత్వ భూములు, చెరువులు కాపాడాల్సిన నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు కుమ్మక్కై చెరువుల దురాక్రమణకు శ్రీకారం చుట్టారు. జిల్లా కేంద్రంలో ఇంతవరకు పదుల సంఖ్యలో ప్రభుత్వ చెరువులు మాయమయ్యాయి. చెరువుల సమీపంలో కొంత జిరాయితీ భూమి తీసుకున్న తర్వాత ఆ చెరువును ఆక్రమించి మొత్తం భూమిని లేఅవుట్‌గా చూపించడం, ప్లాట్లు వేసి విక్రయాలు చేయడం ఈ ప్రాంతంలో ఆక్రమణలు జోరుగా జరుగుతోంది. గత ప్రభుత్వ హయాంలోనూ, ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనూ ఈ భూబాగోతం దర్జాగా సాగుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. రియల్ ఎస్టేట్ మాఫియాకు అధికారపార్టీ నాయకులు, జిల్లా అధికారుల అండదండలు పుష్కలంగా ఉండడంతో చెరువుల చెరపట్టే కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతూ వస్తోంది. చెరువుల ఆక్రమణలను అడ్డుకోవాల్సిన జిల్లా రెవెన్యూ అధికారులు సైతం దందాల్లో భాగస్వాములు కావడంతో అడ్డులేకుండా పోయింది. ప్రభుత్వ చెరువుల కబ్జాలపై వందల సంఖ్యలో ఫిర్యాదులున్నా అధికారులు చర్యలు సున్నా. మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ చెరువులు రియల్ ఎస్టేట్ వ్యాపారానికి కేంద్రాలుగా దర్శనమిస్తున్నాయి. పట్టణ పరిధిలోని జగన్నాథపురం, కొత్తవలస, బెలగాం, సుందర నారాయణపురం గ్రామాల్లో కోట్లాది రూపాయల విలువైన చెరువులు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. రెవెన్యూ రికార్డులను ట్యాంపరింగ్ చేసి జిరాయితీ సర్వే నెంబర్లతో రిజిస్ట్రేషన్ చేయడం ఇక్కడ (మిగతా 3లో...)

సాంస్కృతిక వారసత్వానికి రక్షణ

● గురజాడ గృహ పునరుద్ధరణకు రూ.12.05 లక్షలు మంజూరు

● రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్



ప్రజాశక్తి-విజయనగరంకోట

తెలుగు జాతికి గర్వకారణమైన ప్రముఖ సంఘసంస్కర్త, సాహిత్య యుగపురుషుడు గురజాడ అప్పారావు చారిత్రక గృహాన్ని సాంస్కృతిక వారసత్వ సంపదగా భావించి దాని పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎంఎస్‌ఎంఇ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. గురజాడ చారిత్రక గృహానికి తగిన రక్షణ లేక ఆకతాయిలు లోపలికి ప్రవేశిస్తున్నారనే విషయాన్ని గురజాడ వారసులు వెంకట ప్రసాద్, ఇందిరా దంపతులు ఈ నెల 25న తన దృష్టికి తీసుకువచ్చారని మంత్రి తెలిపారు. దీనిపై తాను వెంటనే స్పందించి జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నల్లనయ్యతో చర్చించామని చెప్పారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ ఇంజనీర్ గురజాడ గృహాన్ని పరిశీలించి అంచనాలు రూపొందించగా, వాటిని పరిశీలించిన అనంతరం గృహ పునరుద్ధరణ, భద్రత చర్యల కోసం మొత్తం రూ.12.05 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే కలెక్టర్ ఆదేశాల మేరకు సీసీ కెమెరాల ఏర్పాటు పూర్తయ్యిందన్నారు. గురజాడ గృహం కేవలం ఒక నివాసం మాత్రమే కాకుండా తెలుగు సాహిత్య, సామాజిక చైతన్యానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఈ నిధులతో టాయిలెట్ నిర్మాణం, పైకప్పు వాటర్‌ప్రూఫ్ మరమ్మత్తులు, భవనానికి రంగులు వేసే పనులు చేపడతామని చెప్పారు. పాత గోడ గడియారం (మిగతా 3లో...)

ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి- కంటోన్మెంట్

నగరంలోని జెఎన్‌టియు గురజాడ విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థి శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. విశాఖపట్నంలోని జాలారిపేటకు చెందిన ఉదయ్ వెంకటతేజ(19) స్థానిక జెఎన్‌టియులో హాస్టల్‌లో ఉంటూ ఇఇఇ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం తోటి స్నేహితులు కళాశాలకు వెళ్లినప్పటికీ వెంకటతేజ మాత్రం వసతి గృహంలోనే ఉండిపోయాడు. మధ్యాహ్నం భోజన విరామంలో తోటి విద్యార్థులు గదికి వచ్చి తలుపు కొట్టినప్పటికీ తెరవలేదు. దీంతో అనుమానం వచ్చి చూసిన విద్యార్థులకు వెంకటతేజ ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు. వెంటనే అధ్యాపకులకు సమాచారం ఇవ్వడంతో పోలీసుల వచ్చి సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు.

ఎన్ఆర్ఇజిఎస్ లక్ష్య సాధన వేగవంతం

● వేసవి ప్రణాళిక సిద్ధం చేయాలి

● కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి



ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లాలో ఒడిఎఫ్, ఎన్ఆర్ఇజిఎస్ లక్ష్య సాధనను వేగవంతం చేయాలని కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి సూచించారు. శుక్రవారం టెలి కాన్ఫరెన్సు ద్వారా అధికారులకు వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. ఒడిఎఫ్, ఒడిఎఫ్ ప్లస్ పూర్తయిన గ్రామాలను వెంటనే డిక్లేర్ చేయడంతో పాటు, ఇప్పటికే డిక్లేర్ చేసిన గ్రామాల్లో వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్ఆర్ఇజిఎస్ కింద ప్రభుత్వ ఆదేశాల మేరకు రోజుకు 47 వేల మాన్‌డేస్ లక్ష్యంగా నిర్ణయించిన నేపథ్యంలో, జిల్లాకు కేటాయించిన లక్ష్యాన్ని తప్పనిసరిగా సాధించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాకు మంజూరైన 40 సచివాలయ భవనాల్లో ఇప్పటివరకు 17 మాత్రమే గ్రౌండింగ్ అయ్యాయని, మిగిలిన సచివాలయాలకు సంబంధించి ఉన్న (మిగతా 3లో...)

రైతు సంక్షేమమే ధ్యేయం : మంత్రి

ప్రజాశక్తి - సాలూరు

రైతులకు భూ హక్కుల విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులను తొలగిస్తూ, కూటమి ప్రభుత్వం కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తుందని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. సాలూరులో పట్టాదార్ పాస్ పుస్తకాల జారీ ప్రక్రియ కార్యక్రమాన్ని మంత్రి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఐదేళ్లుగా రీ-సర్వే పేరుతో జరిగిన గందరగోళానికి స్వస్తి పలికి, రైతులకు భరోసా ఇచ్చేలా ఈ కార్యక్రమం సాగుతోందన్నారు. ప్రస్తుతం పంపిణీ చేస్తున్న పాస్ పుస్తకాలను అధునాతన సాంకేతికతతో రూపొందించారన్నారు. ఇందులో భూమి విస్తీర్ణంతో పాటు, భూమికి సంబంధించిన మ్యాప్, భద్రత కోసం క్యూఆర్ కోడ్ వంటి ప్రత్యేకతలు ఉన్నాయని తెలిపారు. భూ సమస్యలు పరిష్కారమై పక్కాగా ఉన్న పాస్ పుస్తకాలు చేతికి అందడం పట్ల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. భూమిపై రైతుకు పూర్తి హక్కు కల్పించడమే కాకుండా, ఎటువంటి వివాదాలకు తావులేకుండా పారదర్శకమైన రికార్డులను అందించడమే ఈ నూతన పాస్ పుస్తకాల లక్ష్యమని అన్నారు. రైతులను ఆర్థిక ఇబ్బందుల నుంచి కాపాడడమే లక్ష్యంగా, నేరుగా గ్రామాల స్థాయిలోనే ఈ ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీ సర్వే ప్రాజెక్టులో భాగంగా, రైతులకు ప్రభుత్వ అధికారిక రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేసే కార్యక్రమం ఘనంగా ప్రారంభమైందన్నారు. జిల్లావ్యాప్తంగా 280కి పైగా గ్రామాల్లో సుమారు 77,000 మంది రైతులకు ఈ కొత్త పాస్ పుస్తకాలు అందనున్నాయన్నారు. ఈ పంపిణీ కార్యక్రమం ఈనెల 2 నుంచి 9 వరకు నిరంతరాయంగా కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు. ప్రతి మండలంలో రోజుకు ఒకటి లేదా రెండు గ్రామాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఒకవేళ ఆన్‌లైన్ డేటాలో గానీ, కొత్తగా వచ్చిన పుస్తకాల్లో (మిగతా 3లో...)



మహిళా రైతుకు పట్టాదారు పాసుపుస్తకం అందజేస్తున్న మంత్రి సంధ్యారాణి

రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాలు

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

రైతులకు మేలు చేకూర్చే విధంగా కూటమి ప్రభుత్వం రాజ ముద్రతో భూ హక్కు పత్రాలు మంజూరు చేస్తుందని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. శుక్రవారం కారాడ గ్రామంలో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను ఆయన అందించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో భూముల రీసర్వే పూర్తి అయిన గ్రామాల్లో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేస్తున్నామన్నారు. గ్రామంలో 2,700 ఎకరాలు సర్వే చేసి, ఎటువంటి వివాదాలు, ఇబ్బందులు లేని భూమికి 821 పాసు పుస్తకాలను సంబంధిత రైతులకు అధికారులు అందజేయనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం హయాంలో మాజీ ముఖ్యమంత్రి ఫోటోతో ఇచ్చిన పాసు పుస్తకాలు కాకుండా, ప్రభుత్వ అధికారిక రాజముద్రతో కొత్త భూ హక్కు పత్రాలను రైతులకు అందిస్తుందని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ జివివిఎస్ రామ్మోహన్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి అల్లాడ భాస్కరరావు, టిడిపి మండలం అధ్యక్షులు వాసిరెడ్డి సత్యనారాయణ, మండల బిజెపి అధ్యక్షులు తాడ్డి ఈశ్వరరావు, సర్పంచ్ ప్రతినిధి చొక్కాపు సంజీవ్ నాయుడు, కారాడ పిఎసిఎస్ చైర్మన్ పొట్నూరు జనార్దన్, తహశీల్దార్ ఎం.శ్రీను, పలు గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, టిడిపి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ

శృంగవరపుకోట: పట్టణంలోని ఆర్కే కళ్యాణ మండపంలో శుక్రవారం ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, డిసిఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మండలానికి సంబంధించి 20 గ్రామాలకు గాను 10,390 పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం 18 నెలల కాలంలో రాష్ట్రంలో రీసర్వే జరగని గ్రామాల్లో కూడా రీ సర్వే నిర్వహించి ఇప్పుడు వారందరికీ పట్టాదారు పాసు పుస్తకాలు ఇస్తుందన్నారు. రైతులకు సంబంధించి విత్తనాలు, ధాన్యం కొనుగోలు సంక్రమంగా జరుగుతున్నాయని 24 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్ర శేఖర్, జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ వబ్బిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మెంటాడ: మండలంలోని బడేవలస గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించి 97 మంది రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలను తహశీల్దార్ అరుణకుమారి చేతులు మీదుగా పంపిణీ చేశారు. ఈ నెల 9వ తేదీ వరకు రీ సర్వే జరిగే గ్రామాల్లో పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ హేమంత్ కుమార్, గ్రామ నాయకులు మీసాల గురునాయుడు, సువ్వాడ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: మండలంలోని కాకరాపల్లి, మందరాడ పంచాయతీలో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బి. సుదర్శన్ రావు రైతులకు పాస్ పుస్తకాలను అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో జారీ చేసిన భూ హక్కు పత్రాలను రద్దు చేసి, ప్రభుత్వ అధికారిక రాజముద్రతో కూడిన కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు తహశీల్దార్ తెలిపారు. ఈ పంపిణీ ప్రక్రియ ఈనెల 9వ తేదీ వరకు కొనసాగుతుందని వెల్లడించారు. రైతులు తమ గ్రామాలకు కేటాయించిన షెడ్యూల్ ప్రకారం నిర్ణీత కేంద్రాలకు హాజరై పాస్ పుస్తకాలను స్వీకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ఆర్.మధు, రీసర్వే డీటీ జయబాబు, ఆర్ఐ కృపారావు, సర్పంచ్ ధనలక్ష్మి, టిడిపి నాయకులు గెడ్డాపు జనార్దన్, శ్రీనివాస్, చాపల గోవిందరావు, కిల్లన సూర్యనారాయణ, గార రాఘవ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని జమ్మాదేవిపేటలో శుక్రవారం పట్టాదారు పాస్ పుస్తకాలను తహశీల్దార్ జె.రాములమ్మ రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ టి. రామకృష్ణ, టిడిపి మండల ఉపాధ్యక్షులు పి.రమణ, మండల రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బాడంగి: మండలంలోని పి.వెంకంపేట, బాడంగి, ఆకులకట్ట గ్రామాల్లో రైతులకు శుక్రవారం ఎంఆర్ఒ వరప్రసాద్ పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు భూ సమాచారం డిజిటల్ విధానంలో సక్రమంగా నమోదు అవుతోందని, పాస్ పుస్తకాల ద్వారా భూ స్వామ్య హక్కులు మరింత బలపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆకులకట్ట సర్పంచ్ ఉయ్యాలా సత్యనారాయణ, కండి రమేష్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని గోపెంపేట, ఉంగరాడ, లచ్చారాయపురం తదితర గ్రామాల్లో శుక్రవారం గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహించి, అర్హులైన రైతులకు తహశీల్దార్ ఐ. కృష్ణలత పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామాల్లో భూ సర్వేలో భాగంగా గుర్తించిన రైతులకు భూ శాశ్వత హక్కు పాస్ పుస్తకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ గ్రామ సభలో డిటి ఈశ్వరరావు, ఆర్ఐ కోటగిరి, విఆర్ఒలు పట్టాభి, సింగం దొర తదితరులు పాల్గొన్నారు.

దత్తిరాజేరు: మండలంలోని తాడేంద్రవలస గ్రామపంచాయతీలో శుక్రవారం తహశీల్దార్ హరిచరణ్ చేతుల మీదుగా పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. ఆ గ్రామానికి 300 పాస్ పుస్తకాలు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డిటి రత్నకుమారి, ఆర్ఐ నారాయణరావు, సర్పంచ్ పూడి తిరుపతి, టిడిపి నాయకులు రమేష్, రైతులు పాల్గొన్నారు.

రాజాం: మండలంలోని ఒమ్మి గ్రామంలో తహశీల్దార్ రాజశేఖర్ ఆధ్వర్యంలో పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఒమ్మి సర్పంచ్ వంగ వెంకట్రావు సూపరింటెండెంట్ ప్రకాష్‌రాజ్, డిటి శివకృష్ణ, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్‌కోట: రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి, గొంపకృష్ణ



బొబ్బిలి: రైతుకు పట్టాదారు పాస్ పుస్తకాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

రైతుల సమస్యలకు రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యమే కారణం: ఎమ్మెల్యే

భోగాపురం: రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారంలో రెవెన్యూ సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో రైతుల నుంచి ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయని వారి నిర్లక్ష్యమే రైతుల సమస్యలకు ప్రధాన కారణమని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అన్నారు. నందిగాం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామస్థాయిలో రెవెన్యూ సమస్యల పరిష్కారాన్ని తాత్సారం చేయడంతో పాటు ప్రజలను అనవసరంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. ఈ కారణంగానే ప్రతి శనివారం నిర్వహించే ప్రజాదర్బార్‌లో నాలుగు మండలాల నుంచి రెవెన్యూ సంబంధిత సమస్యలు పెద్ద సంఖ్యలో వస్తున్నాయని అన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు అండగా నిలవాలనే ఉద్దేశంతో పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తుంటే, రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల రైతులు నిరంతరం ఇబ్బందులు పడాల్సి వస్తోందని తెలిపారు. కొంతమంది రాజకీయ నాయకులు స్వార్థంతో పనిచేస్తున్నారని, అటువంటి వారికి ప్రాధాన్యత ఇవ్వకుండా రైతుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు సూచించారు. భూ సమస్యలకు సంబంధించి వచ్చే రైతుల నుంచి ఎలాంటి వసూళ్లకూ పాల్పడకూడదని స్పష్టం చేశారు. అలా తీసుకున్నట్లు ఫిర్యాదులు అందితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎఎంసి డైరెక్టర్ గరే వెంకటరమణ మాట్లాడుతూ పాసు పుస్తకాలు తప్పులు తడకలగా ఉన్నాయని ఈ పుస్తకాలు తమకు వద్దని అన్నారు. పాస్ పుస్తకాలలో ఉన్న తప్పులు సరిదిద్ది రైతులకు అందజేస్తే మంచిదని అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రమణమ్మ, సర్పంచ్ గరే మురళి, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే



హర్షప్రియను అభినందిస్తున్న డిఇఒ మాణిక్యంనాయుడు

గణిత ప్రతిభా పరీక్షలో సత్తా

ప్రజాశక్తి - నెల్లిమర్ల

గణిత ప్రతిభ పరీక్షల్లో జరజాపుపేట విద్యార్థి ప్రతిభ కనబర్చారు. జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మ్యాథమెటిక్స్ ఫోరం (ఏపిఎంఫ్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో డిసెంబర్ 21న ఆన్‌లైన్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి గణిత ప్రతిభా పరీక్షల్లో జరజాపుపేట జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థిని కాళ్ళ హర్షప్రియ (6వ తరగతి) జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం సాధించి ప్రతిభను చాటుకుంది. ఈ సందర్భంగా శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి యు.మాణిక్యంనాయుడు విద్యార్థినికి గోల్డ్ మెడల్, సర్టిఫికెట్, మెమెంటోలను అందజేశారు. విద్యార్థికి ప్రతిభా పరీక్షల్లో మార్గ నిర్దేశం చేసిన, గైడ్‌గా వ్యవహరించిన గణిత ఉపాధ్యాయుడు శివకు బంగారయ్యను అభినందించారు. ఈ విజయం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని అభినందించి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

'పల్లి' ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి - మెంటాడ

ఉపాధ్యాయ ఉద్యమ నేత, సామాజిక ఉద్యమ నాయకులు, అమరజీవి పల్లి తిరుపతిరావు ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి మిరియాల కృష్ణారావుతో పాటు ఇతర వక్తలు పిలుపునిచ్చారు. శుక్రవారం కీర్తిశేషులు పల్లి తిరుపతరావు 67వ జయంతి సభ గుర్ల గ్రామంలో జెవివి నేత గంటేడి లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మిరియాల కృష్ణారావు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న పల్లి తిరుపతిరావు గ్రామాభివృద్ధితో పాటు పెద్దలని చైతన్య వంతులను చేసి సామాజిక ఉద్యమాన్ని నడిపారని, గుర్ల గెడ్డ మినీరిజర్వాయర్ పూర్తి చేసి రైతులకు సాగునీరు సాధించడానికి ప్రభుత్వంపై ఒత్తిడి చేసి సాధించుకోవాలని కోరారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు మాట్లాడుతూ గుర్ల గెడ్డ ప్రాజెక్టు భూ కబ్జాదారుడు నుంచి కాపాడుకోవాలన్నారు. మంత్రి గుమ్మడి సంధ్యారాణి గుర్ల గెడ్డ ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పూర్తి చేస్తానని హామీ ఇచ్చారని ఇందుకుగాను ఆమెకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నేత గంటేడి అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ చెరకాన రామానాయుడు, ఏ.ఆనందరావు, డప్పు శ్రీను, పల్లి అప్పలనాయుడు, ప్రభూజీ, రెడ్డి రాజప్పలనాయుడు, పి.అప్పలనాయుడు, కె.సూర్యనారాయణ, జివి నారాయణ, షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

జయంతి సభలో వక్తలు



మాట్లాడుతున్న కృష్ణారావు

సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

మాజీ సైనికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని మాజీ సైనిక ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఆర్. కిరణ్ కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక పాతకోటలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను మాజీ సైనికులకు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వ ఉద్యోగులతో మాజీ సైనికులను పోల్చకుండా తెల్ల రేషన్ కార్డు స్థానంలో డిఫెన్స్ వెటరన్ (రక్షణ అనుభవజ్ఞుల కార్డు)ను అందచేయాలని కోరారు. మాజీ సైనికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో గౌరవ అధ్యక్షులు మరడ రామినాయుడు, ఉపాధ్యక్షులు రామకృష్ణ, కార్యదర్శి గోవింద నాయుడు, జాయింట్ సెక్రటరీ ఎస్సార్ మోహన్రావు, ట్రెజరర్ వివి శర్మ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



గోలెంలో నిల్వ ఉన్న నీటిని తొలగిస్తున్న సిబ్బంది

గ్రామాల్లో డ్రైడే

ప్రజాశక్తి - కొత్తవలస

వియ్యంపేట పిహెచ్‌సి పరిధిలో శుక్రవారం 8 సచివాలయాల్లో ఫ్రైడే డ్రైడే విజయవంతం చేశారు. తుమ్మికాపల్లి గేట్ ఏరియాలో ఎస్.కోట మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసరావు పర్యటించి కాలువల్లో నీటి నిల్వలు గోలేల్లో నీటి నిల్వలు పరిశీలించారు. టైర్లు, కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ డబ్బాలలో నిల్వలు లేకుండా చూడాలని తెలిపారు. వాగ్దేవి కాలేజీ దగ్గర టైర్లు షాపు పరిశీలించారు. డెంగీ జ్వరాలు, స్క్రబ్ టైఫస్, మలేరియా వ్యాధులు పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, హెల్త్ సూపర్ వైజర్ ఈశ్వరరావు, ఏఎన్ఎం గౌరీ, ఆశ వర్కర్ జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి 20ఏళ్ల జైలు

ప్రజాశక్తి - కంటోన్మెంట్

బాడంగి పోలీసు స్టేషనులో 2024సంవత్సరంలో నమోదైన పోక్సో కేసులో నిందితుడు బాడంగి మండలం వాడాడ గ్రామానికి చెందిన వాడాడ వెంకటరమణ (23)కు విజయనగరం పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి 20ఏళ్ల జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధించడంతోపాటు, బాధితురాలికి పరిహారంగా రూ.5 లక్షలు మంజూరు చేస్తూ శుక్రవారం తీర్పు వెల్లడించారు. బాడంగి మండలం రాజేరు గ్రామానికి చెందిన 14ఏళ్ల బాలిక కనపడుటలేదని బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై బాడంగి పోలీసు స్టేషను ఎస్ఐ జె.తారకేశ్వరరావు మిస్సింగు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. కేసు దర్యాప్తులో వాడాడ గ్రామానికి చెందిన ఒక నిందితుడు వాడాడ వెంకటరమణ ఆ బాలికను ప్రేమిస్తున్నాని వెంటపడుతూ, పెళ్లి చేసుకుంటానని నమ్మించి బాలికను కత్తిపూడి తీసుకొని వెళ్లి, అక్కడ ఆ బాలికను శారీరకంగా పలు మార్లు అనుభవించాడని తెలియడంతో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. బొబ్బిలి డిఎస్‌పి జి.భవ్యరెడ్డి కేసును దర్యాప్తు చేపట్టి, నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. నిందితుడిపై నేరారోపణలు రుజువు కావడంతో పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి 20ఏళ్ల జైలుశిక్ష విధించారు. కేసు దర్యాప్తులో క్రియాశీలకంగా వ్యవహరించిన పోలీసుసిబ్బందిని ఎస్‌పి ఎఆర్ దామోదర్ అభినందించారు.

రైలు పట్టాల పక్కన గుర్తు తెలియని మృతదేహం

ప్రజాశక్తి- కంటోన్మెంట్



విజయనగరం-కోరుకొండ రైల్వే స్టేషన్‌ల మధ్య రైల్వే ట్రాక్ పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం లభ్యమైందని విజయనగరం రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడి వయసు 50 నుంచి 55 మధ్య ఉంటుందని, ఎరుపురంగు ఛాయ, నీలం రంగు ఫుల్ హేండ్స్ షర్టు, బ్లాక్ జీన్ ఫ్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు రైల్వే పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ పి. రవి కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 919490617089, 9441962879 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు



సమావేశంలో మాట్లాడుతున్న సిఐ ఉపేంద్రరావు

చోరీ కేసులో భార్యాభర్తలు అరెస్టు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని బాలకావివలన లో గత నెల 4న 13 తులాల బంగారం చోరీకి పాల్పడిన కేసును శుక్రవారం పోలీసులు చేధించారు. బాధితురాలు కిల్లారి కమల ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వి బాలకృష్ణ కేసు నమోదు చేసి రాజాం రూరల్ సిఐ హెచ్. ఉపేంద్రరావు ఆధ్వర్యంలో దర్యాప్తు చేశారు. పోలీసు బృందాలను ఏర్పాటు చేసి హైదరాబాద్, గోవా, భువనేశ్వర్ ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టి నిందితులను పట్టుకున్నారు. శుక్రవారం రాజాం సర్కిల్ పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను సిఐ వెల్లడించారు. బాలకావివలస జంక్షన్ వద్ద అదే గ్రామానికి చెందిన డోల గాయత్రి, ఆమె భర్త బాపట్ల జిల్లా చీరాల మండలం వైకుంఠపురం గ్రామానికి చెందిన దుడ్ల బాలాజీ హైదరాబాద్, గోవా, భువనేశ్వర్ వంటి ప్రాంతాలకు వెళ్లి వస్తూ ఉండటంతో వీరిపై దృష్టి సారించాం. వీరిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా నేరం అంగీకరించారు. ఈ 13 తులాల బంగారం ముత్తూట్ ఫైనాన్స్, శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలసలో కొంత ఆభరణాలు, బాపట్ల జిల్లా చీరాల నందు ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో కొంత బంగారు ఆభరణాలు తాకట్టుపెట్టి 15 లక్షలు నగదు తీసుకున్నారు. వీటిలో నాలుగు లక్షలు అప్పులు తీర్చి, 11 లక్షల్లో అన్నయ్య, తండ్రికి కొంత నగదు ఇచ్చారు. మిగతా నగదుతో విలాసవంతమైన జీవితం గడిపారు. గాయత్రి.. బంధువుల ఇళ్లల్లో చిన్న, చిన్న చోరీలకు పాల్పడుతోందని తెలిసింది. ఇంటర్ చదివిన గాయత్రీ చీరాల మండలం వైకుంఠపురానికి చెందిన బాలాజీతో పరిచయం ఏర్పడి వివాహం చేసుకుంది. కేసు దర్యాప్తులో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ బాలకృష్ణ, హెచ్‌సి శ్రీనివాసరావు, కానిస్టేబుల్ రామకృష్ణ, ఆర్.శివ, కె.మోహనరావును అభినందించారు.

18నెలల్లో ఎంతో అభివృద్ధి

ప్రజాశక్తి-విజయనగరం కోట

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలల్లో నియోజకవర్గంలో ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి ఆధ్వర్యాన ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, పట్టణ పార్టీ అధ్యక్షులు గంటా రవి, మండల పార్టీ అధ్యక్షులు గంటా పోలినాయుడు, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు అన్నారు. శుక్రవారం టిడిపి కార్యాలయం అశోక్ బంగ్లాలో ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గంలో విద్య, వైద్యం, విద్యుత్తుకు అధిక ప్రాధాన్యతిచ్చారని అన్నారు. సిఎం రిలీఫ్ ఫండ్ కింద 30 మంది రోగులకు రూ.35 లక్షలు మంజూరు చేశారన్నారు నిర్మించడానికి ప్రణాళికలు రూపొందించారని తెలిపారు.

కబ్జాల చెరలో జిల్లా కేంద్రం

(మొదటిపేజీ తరువాయి)

పరిపాటిగా మారింది. డివిజన్ కేంద్రంగా ఉన్న పట్టణానికి జిల్లా కేంద్రం హోదా రావడమే శాపంగా మారుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

కబ్జాలకు గురైన చెరువులివే:

జగన్నాధపురం లో...

సర్వే నెం 9,10 లో దాసరి బంద
సర్వే నెం 17,18 నగురి బంద, స్మశానం దాటి గోర్జ 1.28 ఎకరాలు.
సర్వే నెం 22కృష్ణుడి దేవాలయం దగ్గరచెరువు
సర్వే నెం 44. జగన్నాథ సాగరం
సర్వే నెం 51 కంచమ్మ చెరువు
సర్వే నెం 81. బయ్య కోనేరు డంపింగ్ యార్డ్ ఎదురుగా
సర్వే నెం 91. గాసి వీధి దగ్గరపూర్ణ చెరువు

కొత్తవలసలో...

సర్వే నెం 102. గోపసాగరం డంపింగ్ యార్డ్ వద్ద
సర్వే నెం 98. లెప్రసి కాలనీ పక్కన చెరువు
సర్వే నెం 116. అమరావతి లేఅవుట్ పక్కన
సర్వే నెం 120. అమరావతి లేఅవుట్ పక్కన
సర్వే నెం 124 బిళ్ళ బంద
సర్వే నెం 202. పెద్ద చెరువు కొత్తవలస.
సర్వే నెం 137. టౌన్ రైల్వే స్టేషన్ పక్కన తమ్మి నాయుడు చెరువు
సర్వే నెం 256.చెరువులో విజయరామరాజు కాలనీ ఉప్పర వీధి.
సర్వే నెం 133. బందలో సత్యనారాయణమూర్తి దేవస్థానం రైల్వే వంతెన.
సర్వే నెం 180.181.206. కొత్తవలస దుర్గ గుడి, ఆర్డీవో సుదర్శన్ దొర ఇంటి వెనుక భాగం, మూడు చెరువులు
సర్వే నెం 209. కొత్తవలస ఆంజనేయ స్వామి గుడి.
సర్వే నెం 265. చెరువులో గిజబ కాలనీ.
సర్వే నెం 272. కొత్తవలస వై జంక్షన్ దగ్గర.

బెలగాం,సుందర నారాయణపురం

గ్రామకంఠంలోఉన్న కొత్త వీధి త్రినాధ స్వామి ఆలయం కోనేరు.
సర్వే నెం 343. దేవుని బంద.
సర్వే నెం 348-7 అమ్మి గారి కోనేరు, లక్ష్మీ రెసిడెన్సి వెనుక
సర్వే నెం 337 కామయ్య బంద
సర్వే నెం 352 బాలాజీ థియేటర్ మెయిన్ రోడ్ ఎదురుగా బోటు వాని కోనేరు.
సర్వే నెం 383. కూర్మ సాగరం, ప్రక్కన మరో చెరువు
సర్వే నెంబర్ 624, ఎస్ ఎన్‌పి కాలనీ, స్మశానం దగ్గర.
సర్వే నెం. 304, 329 రెండు బిళ్లచెరువులు రైల్వే అండర్ బ్రిడ్జి దగ్గర
సర్వే నెం 307 ఆశాజ్యోతి ఆశ్రమం వెనుక.
సర్వే నెం 401 నెల్లిచెరువు రైతు బజార్
సర్వే నెం 372, 632 సుందర నారాయణపురం చివరి భాగంలో రెండు చెరువులు ఒకే దగ్గర
సర్వే నెం 650 అమ్మిగారి టేంక్ ఎస్. ఎన్. పి. కాలనీ దగ్గర.
సర్వే నెం 617. బెలగాం అగ్రహారం వీధి శివాలయం కోనేరు.
సర్వే నెం 573 కోదివాని బంద వైకెఎం నగర్
సర్వే నెం 564 సున్నపు కోనేరు సుబ్బయ్య అపార్ట్మెంట్ పక్కన.
సర్వే నెం 557, 539 బెలగం రైల్వే గేట్ కి ఆనుకుని ఇరువైపులా రెండు చెరువులు.
సర్వే నెం 550. చెరువు వీధి లో
సర్వే నెం 517 బాలగుడబ ప్రారంభంలో కొత్తగా నిర్మించిన ఆంజనేయ గుడి దగ్గర చెరువులు ఆక్రమణకు గురయ్యాయి.

దశాబ్దాల కాలం నాటి ప్రకృతి సిద్ధంగా వెలసిన చెరువులు నేడు కనుమరుగు కావడంతో పట్టణానికి తీవ్ర ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే భారీ వర్షాలు కురిసే సమయంలో లోతట్టు ప్రాంతాలన్నీ చెరువుల్లా మారుతున్నాయి. ప్రధాన రహదారి కూడలి ముడుకు లోతు నీటిలో మునిగిపోతోంది. పట్టణ పరిసర ప్రాంతాల్లో ఉన్న చెరువుల్లో రియల్ ఎస్టేట్ అపార్ట్మెంట్‌లు వెలిసిపోవడంతో పట్టణంలో వర్షపునీరు బయటకు వెళ్లే మార్గం లేకుండా పోయింది. దీంతో పట్టణ ప్రజలు వర్షాకాలంలో నానా అవస్థ లు పడుతున్నారు.

చెరువుల పరిరక్షణ సమితి పోరాడుతున్నా...

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ చెరువుల పరిరక్షణ లక్ష్యంతో ఏర్పడిన సమితి గత కొంతకాలంగా చెరువుల కబ్జాలపై పోరాడుతున్నా ప్రజాప్రతినిధులు, అధికారుల నుంచి స్పందన కరువైంది. కబ్జాల పర్వంలో సూత్రధారులుగా నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారుల ఉండడంతో సమితి నాయకులు చేసినా ఫిర్యాదులపై చర్యలు కనిపించడం లేదు. చెరువుల కబ్జాలు చట్టరీత్యా నేరమని సుప్రీంకోర్టు హెచ్చరించినా బేఖాతరు చేస్తున్న పరిస్థితి నెలకొంది.

చెరువులు కబ్జాలపై సమగ్ర సర్వే నిర్వహించాలి

పార్వతీపురం పట్టణంలో ప్రభుత్వ చెరువులు, గెడ్డలు ఆక్రమణకు గురయ్యాయి. కబ్జా చేసిన భూముల్లో రియల్ ఎస్టేట్ అపార్ట్మెంట్లు వెలిశాయి. రెవెన్యూ అధికారుల అండదండలతోనే ఈ కబ్జాలు జరిగాయన్నది వాస్తవం. గత కొన్నేళ్లు సిపిఎంతో సహా వామపక్షాలు, ప్రజాసంఘాలు చెరువుల కబ్జాలపై పోరాడుతున్నాయి. అనేక సార్లు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశాం. అయినా అధికారులు స్పందించిన దాఖలాల్లేవు. వరహాల గెడ్డ ఆక్రమణ విషయంలో ప్రజాసంఘాలు ఐక్యంగా పోరాటం చేయడం వల్లే అధికారులు కంచె వేశారు. పట్టణంలో ఆక్రమణకు గురైన మొత్తం చెరువులు, కాలువలపై సమగ్ర సర్వే నిర్వహించాలి. అనంతరం ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టాలి.

కె.గంగునాయుడు,
సిపిఎం జిల్లా కార్యదర్శి .

మొదటి పేజీ తరువాయి

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : మంత్రి

పేర్లు, విస్తీర్ణం వంటి అంశాల్లో ఏవైనా తప్పులుంటే రైతులు ఆందోళన చెందవద్దని ఆయన భరోసా ఇచ్చారు. అటువంటి సమస్యలను వెంటనే స్థానిక విఆర్ఒ, సర్వేయర్ లేదా తహశీల్దార్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఫిర్యాదు చేసిన రెండు నుంచి మూడు వారాల వ్యవధిలోనే అన్ని లోపాలను సరిదిద్ది, సరైన పత్రాలను అందజేస్తామని జేసీ హామీ ఇచ్చారు. పట్టాదారు పాస్‌పుస్తకాల్లో భూ విస్తీర్ణం భూమికి సంబంధించి మ్యాప్, భద్రత కోసం క్యూఆర్ కోడ్ వంటి ప్రత్యేకతలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో పార్వతీపురం సబ్ కలెక్టర్ వైశాలి, ఎఎంసి చైర్మన్ ముఖీ సూర్యనారాయణ, మండల, పట్టణ టిడిపి అధ్యక్షులు ఆమదాల పరమేష్, నిమ్మాది తిరుపతిరావు, స్థానిక ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఇజిఎస్ లక్ష్య సాధన వేగవంతం

మరమ్మత్తులు, ఓపెన్ ఏరియా అభివృద్ధి పనులు జరుగుతాయని, విద్యుత్ వ్యవస్థను సింగిల్ ఫేజ్ నుంచి త్రీ ఫేజ్‌కు మార్చడం జరుగుతుందని వివరించారు. ఈ గృహం కలకాలం నిలిచి గురజాడ ఆలోచనలు, ఆదర్శాలు భావితరాలకు మార్గదర్శకంగా నిలవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు.

సాంస్కృతిక వారసత్వానికి రక్షణ

సమస్యలను వెంటనే పరిష్కరించి పనులు ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. అందులో 9 భవనాలకు ప్రత్యామ్నాయ స్థలాలు గుర్తించినందున సంబంధిత ప్రతిపాదనలు తక్షణమే సమర్పించాలని, మరో రెండు సచివాలయాలకు స్థలాలను గుర్తించి ప్రతిపాదనలు పంపాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం ఉండరాదని, సమన్వయంతో వేగంగా పనులు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

రానున్న వేసవిని దృష్టి లో పెట్టుకొని తాగు నీటి సమస్య తలెత్తకుండా , నీరు కాలుష్యం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీ శాఖల అధికారులకు సూచించారు. అదే విధంగా వ్యాధులు సంక్రమించకుండా కూడా తగు జాగ్రత్త వహించాలి ఆదేశించారు.

రీసర్వేలో రైతుల సహకారం అవసరం

ప్రజాశక్తి - కొమరాడ

రీసర్వే చేస్తున్న సమయంలో రైతుల సహకారం అధికారులకు చాలా అవసరమని సర్వేయర్ డిపార్ట్మెంట్ ఎడి పి.లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం మూడో విడత రీసర్వే ప్రక్రియ కొమరాడలో నిర్వహించారు. కొమరాడ రెవెన్యూ పరిధిలో గల భూములకు రీసర్వే రైతుల సమక్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రీసర్వే ప్రక్రియను రైతులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులకు ఈ రీసర్వే ప్రక్రియ పూర్తయితే భూతగాదాల్లేని హక్కు పత్రాలు అందించడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో భూ సమస్యల్లేకుండా ఉండాలంటే రీసర్వే సక్రమంగా జరిగేలా రైతులు రెవెన్యూ అధికారులకు సహకరించాలని కోరారు. ఏ రోజు ఏ రైతులు భూములు రీసర్వే చేస్తామో ముందుగా రైతులకు సిబ్బంది తెలియజేస్తారని తెలిపారు.

మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మత్స్యకారుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని మత్స్యకారుల సంఘం నూతన జిల్లా అధ్యక్షులు సింగిడి పాపారావు అన్నారు. శుక్రవారం సారిపల్లిలో మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన సింగిడి పాపారావుని గ్రామస్థులు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్య కారుల సోసైటీ అభివృద్ధి, రుణాలు, చేపల చెరువుల వేలంలో మత్స్య కారులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బోనుమహంతి ఆదినారాయణ మాస్టర్, బిసి సంఘం అధ్యక్షులు సారిపల్లి బాబురావు, మజ్జి రాంబాబు, తంగేటి భాస్కరరావు యువకులు పాల్గొన్నారు.

ఐటిడిఎ పిజిఆర్ఎస్‌కు 7 వినతులు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఏడుగురు తమ సమస్యలపై వినతులు సమర్పించారు. ఐటిడిఎ ఎఒ వి.సునీల్ అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. వీటిలో కొన్ని వీరఘట్టం మండలం గదబవలసకు చెందిన యలకుల వెంకటరమణ నాటు కోళ్ల ఫారం షెడ్ మంజూరు చేయాలని, మెలియాపుట్టి మండలం రింపి గ్రామానికి చెందిన పోతయ్య మినీ ట్రాక్టర్ మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు. అలాగే మూలరింపి గ్రామానికి చెందిన తవిటయ్య మినీ ట్రాక్టర్ మంజూరు చేయాలని, పవర్ వీడర్, ఏదైనా స్వయం ఉపాధి పథకాలను మంజూరు చేయాలని మరికొంత మంది వినతులు సమర్పించారు. కార్యక్రమంలో డిపిఎం రమణ, డిఇ నాగభూషన్, పశు సంవర్ధక శాఖ ఎడి శ్రీనివాసరావు, ఎపి కమల కుమారి, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ సత్యం, పాపారావు, వెంకటేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే విజయ చంద్ర అన్నారు. పట్టణంలోని బెలగాం గెడ్డ వీధి సమీపంలో చౌక ధరల దుకాణంలో గోధుమపిండి పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఇక్కడికి వచ్చిన లబ్ధిదారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. చౌక ధరల దుకాణంలో ఏఏ సరుకులు అందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు పండగ రోజుల్లో పేదలకు అవసరమైన నిత్యవసరాలను ప్రభుత్వం తక్కువ ధరకు అందించి ఆర్థిక భారాన్ని తగ్గిస్తుందని ఎమ్మెల్యే వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సరుకులను అంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. శుక్రవారం రంగరాయపురంలో ప్రజాసమస్యల పరిస్కార వేధికలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రజల సమస్యలను అధికారులకు నేరుగా చేరవేసే ప్రక్రియను కూటమి ప్రభుత్వం సులభతరం చేసిందన్నారు. సచివాలయంలో 12 సమస్యలు తమ దృష్టికి వచ్చాయన్నారు. తక్షణమే సమబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ యం శ్రీను, ఎంపిడిఒ రవి కుమార్, డిప్యూటీ ఎంపిడిఒ భాస్కరరావు, పంచాయతీరాజ్ శాఖ, విద్యుత్ శాఖ, హౌసింగ్, వెలుగు, పోలీసు శాఖ, ఇరిగేషన్ మొదలగు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

4న జరిగే బహిరంగ సభకు తరలిరావాలి

ప్రజాశక్తి - సాలూరు

సిఐటియు 18వ అఖిలభారత మహాసభల ముగింపు సందర్భంగా ఈనెల 4న విశాఖలో జరుగు బహిరంగ సభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు పిలుపునిచ్చారు. ప్రచార కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలో ఆటో స్టాండ్లు, మున్సిపల్ కార్యాలయం, బ్యాంకులు, కళాశాలు, యూత్ హాస్టల్ తదితర ప్రాంతాల్లో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్‌వై నాయుడు, పట్టణ నాయకులు శంకర్, రవి, రాముడు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎ.సంతోష్, టి.వెంకటరావు,టి.స్వప్న,శ్రీను పాల్గొన్నారు.

కొమరాడ : కొమరాడలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు ఇందిర మాట్లా డుతూ కార్మిక, కర్షక ఐక్యతతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను తిప్పి కొట్టడమే అఖిల భారత మహాసభల ప్రధాన లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి, అంగన్వాడీ కొమరాడ ప్రాజెక్ట్ లీడర్ అనురాధ, ఎండిఎం నాయకులు సుజాత, ఆశావర్కర్ల నాయకులు రాజేశ్వరి, సిహెచ్ డబ్ల్యు నాయకులు దుర్గ, పాల్గొన్నారు.

విజయనగరంటౌన్ : సిఐటియు 18వ అఖిలభారత మహాసభల ముగింపు సందరర్భంగా జనవరి 4న విశాఖపట్నం మున్సిపల్ స్టేడియంలో జరిగే బహిరంగ సభకు వేలాదిగా తరలి రావాలని కోరుతూ సిఐటియు విజయనగరం నగర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కోట జంక్షన్ వద్ద ఆటో ప్రచారాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భగా నగర అధ్యక్ష కార్యదర్శులు ఎ. జగన్మోహన్‌రావు, బి.రమణ మాట్లాడుతూ డిసెంబర్ 31న విశాఖపట్నంలో మహాసభలు ఘనంగా ప్రారంభమయ్యాయని, ప్రారంభ సభకు అన్ని కేంద్ర కార్మిక సంఘాల నాయకులు హాజరయ్యారని, కేంద్రంలో బిజెపి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను ముక్తకంఠంగా ఖండించారని తెలిపారు. కార్యక్ర మంలో ఆటో యూని యన్ నాయకులు బొమ్మన పాపారావు, బి.రామునాయుడు, కళాసి యూనియన్ నాయ కులు రాజు, శ్రీను, డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ సిహెచ్ హరీష్ పాల్గొన్నారు.



సాలూరు: ప్రచారం చేస్తున్న సిఐటియు నాయకులు

గజపతినగరం : ఈనెల 4న విశాఖలోజరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని బంగారమ్మపేట, బగ్గాం తదితర గ్రామాల్లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి.కృష్ణ, గురువులు సత్యం, గౌరీ, అప్పయ్యమ్మ, రాధ పాల్గొన్నారు.

రామభద్రపురం : మండల కేంద్రంలోని ఆగూరు వీధిలో శుక్రవారం హలో కార్మిక.. చలో విశాఖ కార్యక్రమాన్ని సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యాక్షులు పి. శంకరరావు మాట్లాడుతూ ఈ నెల 4న చలో విశాఖపట్నం జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో విఒఎ సంఘం నాయకులు సాయి, రమ్య, హైమా సిఐటియు జిల్లా నాయకులు సింగిరెడ్డి గోపాలు తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం: ఆటో ప్రచారాన్ని ప్రారంభిస్తున్న జగన్మోహన్

నెల్లిమర్ల: సిఐటియు బహిరంగ సభకు వేలాదిగా కార్మికులు కర్షకులు తరలిరావాలని సిఐటియు జిల్లా కోశాధికారి ఎ. జగన్మోహన్‌రావు, కార్యదర్శి బి.రమణ పిలుపునిచ్చారు. నగర పంచాయతీ కార్యాలయం, ఎపి బేవరేజెస్, నెల్లిమర్ల మాస్టర్ పంప్ హౌస్ కార్మికుల వద్ద ఆటో ప్రచారంలో భాగంగా కార్మికులను కలిసి 4న జరిగే బహిరంగ సభలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆటో యూనియన్ నాయకులు బొమ్మన పాపారావు, మున్సిపల్ యూనియన్ అధ్యక్ష కార్యద ర్శులు బాబురావు, హరిబాబు, ఎపి బేవరేజెస్ నాయకులు శ్రీను, గౌరీ, పాల్గొన్నారు.

వ్యాధుల మూలాలను అన్వేషించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

వైద్యులు వ్యాధుల మూలాలను అన్వేషించాలని, నివారణే ప్రధాన లక్ష్యం కావాలని జిల్లా కలెక్టర్ డా ఎన్ ప్రభాకర రెడ్డి అన్నారు. రాష్ట్ర సచివాలయంలోని సిఎస్ వీడియో కానారేన్స్ హాల్ నుంచి శుక్రవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ అన్ని జిల్లా కలెక్టర్లు తో వీడియో కానారేన్స్ ద్వారా పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ, ప్రజా సానుకూల అవగాహన, రైల్వే లెవెల్ క్రాసింగ్స్,ఎరువులు తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహిస్తున్న సమీక్ష సమావేశానికి జిల్లా కలెక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి, జాయింట్ కలెక్టర్ సి యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ కె.హేమలత, పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు వైశాలి, పవార్ స్వప్నిల్ జగన్నాథ్ తో కలసి పాల్గొన్నారు. మన్యం జిల్లాలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రవేశపెట్టిన 'రెవెన్యూ క్లినిక్' విధానం మంచి ఫలితాలను ఇస్తోందని భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సిసిఎల్ఎ) జి.సాయిప్రసాద్ కొనియాడారు. సమీక్ష అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో ప్రజారోగ్యంపై మెడికల్ ఆఫీసర్లు ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులు ఆదేశించారు. గ్రామ, పంచాయతీ స్థాయిల్లో పారిశుధ్యంపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని, క్షేత్రస్థాయిలో పర్యటించి ఎప్పటికప్పుడు నివేదికలు అందించాలని స్పష్టం చేశారు. కేవలం ఆసుపత్రికి వచ్చిన వారికి మందులు ఇవ్వడమే కాకుండా, అసలు వ్యాధులు రావడానికి గల కారణాలను విశ్లేషించాలని అధికారులకు సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్యను తగ్గించడమే ఈ ఏడాది ప్రధాన లక్ష్యమని, బెడ్ల సంఖ్య పెంచడం కంటే వ్యాధుల నివారణ మీదే ఎక్కువ దృష్టి పెట్టాలని అన్నారు.

ఏడుగురు ఆశా వర్కర్లు ఎంపిక

ప్రజాశక్తి కంటోన్మెంట్

విజయనగరం జిల్లాలో ఖాళీగా ఉన్న ఏడుగురు ఆశ వర్కర్లను ఎంపిక చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎస్ జీవన్ రాణి శుక్రవారం తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో శుక్రవారం డిస్టిక్ హెల్త్ సొసైటీ సమావేశం నిర్వహించామని తెలిపారు ఈ సమావేశంలో ఆశ వర్కర్ల ఖాళీల కొరకు వారి ఎంపిక నియమ నిబంధనలో కొరకు మీటింగు నిర్వహించా మన్నారు ఈ మీటింగ్ లో కమిటీ సభ్యులు అనుమతితో ఖాళీ కొరకు ప్రభుత్వం నుండి ఆమోదం పొందిన ఐదు మండలాల్లో గంట్యాడ బోండ పల్లి, గజపతినగరం,ఎస్.కోట, విజయనగరం మండల గాను ఏడుగురు ఆశా వర్కర్లను ఎంపిక చేయడం జరిగిందన్నారు

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- పార్వతీపురం

జిల్లాలో 104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలనీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు డి.ఆనందరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ స్వామి నాయుడు, సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ, కోశాధికారి గొర్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. శుక్రవారం సుందరయ్య భవనంలో ఏపీ 104 ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యాన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 104 ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు డి ఆనందరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ స్వామి నాయుడు, సిఐటియు జిల్లా కార్యదర్శి బీవీ రమణ, కోశాధికారి గొర్లి వెంకటరమణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సింహాచలం, శంకర్రావు, వరదరాజు, మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం అధ్యక్షులు జి తులసి, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పి సన్యాసిరావు, చిల్లర వర్తకుల సంక్షేమ సంఘం నాయకులు బి సూరిబాబు, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు శివాని, అంగన్వాడి యూనియన్ నాయకులు గౌరీ మణి మాట్లాడుతూ ప్రజలకు సేవలు అందిస్తున్న 104 సిబ్బంది పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని చెప్పారు .104 సేవలను నిర్వహిస్తున్న భవ్య హెల్త్ ఫౌండేషన్ కూడా కార్మికులకు కనీస వేతనాలు చెల్లించకుండా ఉద్యోగ భద్రత కల్పించకుండా తీవ్ర నష్టం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించమంటే కక్ష సాధింపు చర్యలకు పాల్పడి నాయకులను తొలగించటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. యాజమాన్య వాటా పిఎఫ్ మొత్తాన్ని యాజమాన్యం చెల్లించాలని, వాహనాలు మరమ్మత్తులు చేయించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలన్నీ పరిష్కరించాలని లేనియెడల అన్ని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కాలేజీలను దేవాలయాల్లా తీర్చిదిద్దాలి: కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రభుత్వ జూనియర్ కళాశాలలను దేవాలయాల్లా తీర్చిదిద్దాలని, ముస్తాబు అంటే అలంకరణ కాదని, స్వచ్ఛతని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి పేర్కొన్నారు. ఇంటర్ విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆడిటోరియంలో ముస్తాబు కార్యక్రమంపై ఆత్మీయ సత్కార సభ శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ముస్తాబు అనే పదానికి అర్థం కేవలం బాహ్య అలంకరణ కాదని, అది సంపూర్ణ పరిశుభ్రతకు సంకేతమని అన్నారు. చాలా మంది ముస్తాబు అంటే విద్యార్థులకు పౌడర్లు కొట్టడం, నూనెలు పెట్టడం వంటి అలంకరణ పనులని భావిస్తున్నారని, కానీ ప్రభుత్వ ఉద్దేశ్యం పాఠశాలలు, విద్యార్థుల పరిశుభ్రత మాత్రమేనని స్పష్టం చేశారు. తలకు నూనె పెట్టడం వంటి విషయాల్లో శాస్త్రీయ దృక్పథం ఉండాలని, ఐరన్ లోపం వల్ల కలిగే చుండ్రు వంటి సమస్యలపై అవగాహన కల్పించడమే తమ లక్ష్యమని తెలిపారు. దీనికి సంబంధించి అవగాహన వీడియోను కూడా విడుదల చేశామన్నారు. అనంతరం అక్కడి వారితో సరదాగా ముచ్చటిస్తూ తరగతి గదిలో విద్యార్థులు ఎలాగైతే మౌనంగా ఉండకూడదో, అలాగే సామాజిక అంశాలపై కూడా ప్రతి ఒక్కరూ స్పందించాలని పిలుపునిచ్చారు.

ప్రపంచ మహాసభలకు దేవానంద్

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన రాష్ట్ర బాలకథా నిలయం ఉపాధ్యక్షులు మన్యం జిల్లా అధ్యక్షులు పాలక దేవానంద్ ఈనెల 3,4,5, తేదీల్లో గుంటూరులో జరిగే ప్రపంచ మహాసభలకు ఆహ్వానించినట్టు తెలిపారు. అతిరథ, మహానుభావుల సమక్షంలో కవితలాపన చేసే అవకాశం లభించడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఈ అవకాశం ఇచ్చినందుకు ప్రపంచ మహాసభల నిర్వహణకర్త డాక్టర్ గజల్ శ్రీనివాస్ ధన్యవాదాలు తెలిపారు. ఈ అవకాశం లభించినందుకు గ్రామస్తులు, ఉపాధ్యాయులు,స్నేహితులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

మన్యంలో కార్మిక వర్గానికి అండగా సిఐటియు

అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీలో వివిధ కార్మిక, శ్రామిక వర్గాలకు సిఐటియు అండగా నిలిచింది. గత రెండున్నర దశాబ్దాలుగా వారి మనుగడ కోసం అనేక పోరాటాలతో ముందు సాగింది. ఈ ప్రాంతంలోని 20కి పైగా కార్మిక, ఉద్యోగ సంఘాలతో సిఐటియు అనుబంధం పెనవేసుకుంది. ఎర్ర జెండా సాక్షిగా అనేక సమరశీల పోరాటాలతో కార్మిక వర్గాల్లో ఐక్యతను సాధించి వారికి వెన్నుదన్నుగా నిలిచింది.



ప్రదర్శన చేపడుతున్న సిఐటియు నాయకులు, సిహెచ్‌డబ్ల్యులు (ఫైల్)

సమరశీల పోరాటాలతో వెన్నుదన్ను

ప్రజాశక్తి - పాడేరు

పాడేరు ఏజెన్సీలో 1998- 99లో కార్మిక వర్గాలకు అండగా సిఐటియు ఆవిర్భవించింది. అప్పటి ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని గోపాలపట్నం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో అరకు లోయలోని పద్మాపురం కొత్తవలస గార్డెన్స్‌లో ఐటిడిఎ (హెచ్‌ఎన్‌టిసి) డైలీ వేజ్ కార్మికుల సంఘానికి అనుబంధంగా సిఐటియు ప్రస్థానం మన్యంలో మొదలైంది. అప్పట్లో 40 మంది డైలీ వేజ్ కార్మికులు ఈ హెచ్‌ఎంటిసిలో పనిచేసేవారు. వీరికి కిల్లో అప్పన్న అనే గిరిజన కార్మికుడు.. సిఐటియు తరపున నాయకుడిగా వ్యవహరించారు. ఆ తరువాత సిఐటియు అంచలంచెలుగా అనేక కార్మిక, శ్రామిక వర్గాలకు అండగా నిలిచి సమరశీల పోరాటాలతో మరింత చేరువయ్యింది. మినుములూరు, పాడేరు, చింతపల్లి ప్రాంతాల్లో కాఫీ కార్మికులకు అండగా నిలిచి 2001-02 సంవత్సరంలో సిఐటియు చేపట్టిన కాఫీ ఉద్యమంతో వారికి గట్టి భరోసా కల్పించింది. ఈ క్రమంలో ఏజెన్సీలోని అంగన్వాడీ, ఆశా వర్కర్లు, సామాజిక ఆరోగ్య కార్యకర్తల (సిహెచ్‌డబ్ల్యు) వేతన సమస్యలపై సమరశీల పోరాటాలు సాగించి వారికి అండగా నిలిచింది. అదే విధంగా ఫారెస్ట్ వర్కర్స్ యూనియన్, వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం, ఉపాధి హామీ వర్కర్స్ యూనియన్, ఎపిఎండిసి ట్రైబల్ వర్కర్స్ యూనియన్, ప్రయివేట్ టూరిజం వర్కర్స్ యూనియన్, జిసిసి సోప్ యూనిట్ వర్కర్స్ యూనియన్, వెలుగు విఒఎల సంఘం, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం, గిరిజన సంక్షేమ హాస్టల్ వర్కర్స్ యూనియన్, ప్రభుత్వ ఆసుపత్రుల కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్, రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్, ఎన్‌ఆర్‌ఇజిఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం, జిసిసి హమాలీల సంఘం, ఆటో వర్కర్స్ యూనియన్, భవన నిర్మాణ కార్మికుల సంఘం, మోటారు వర్కర్స్ యూనియన్, కాఫీ లైజన్ వర్కర్ల సంఘం, 104, 108, ఉద్యోగ సంఘాలు, తదితర కార్మిక సంఘాలు సిఐటియు గొడుగు కింద పనిచేశాయి.

జెండావిష్కరణలు. బైక్ ర్యాలీలు, ఇంటింటా ప్రచారాలు

సిఐటియు 18వ అఖిలభారత మహాసభ నేపథ్యంలో మన్యం కార్మిక వర్గాల్లో పండుగ వాతావరణం నెలకొంది. అంతటా కార్మికుల్లో సందడి అలుముకుంది. డిసెంబర్ 15 నుంచి మన్యంలో కార్మిక సంఘాలు సిఐటియు అఖిలభారత మహాసభ గురించి విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాయి. ఇంటింటా కరపత్రాలు పంపిణీ, మండల కేంద్రాల్లో బైక్ ర్యాలీలు, విరాళాలు సేకరణ తదితర తదితర ప్రచార కార్యక్రమాలను నిర్వహించాయి. కార్మికవాడల సముదాయాలు, కార్మిక సంఘాల నేతల గృహాలపై జెండా ఆవిష్కరణలు నిర్వహించారు. పాడేరు ఏజెన్సీలోని సుమారు 100 చోట్ల జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు జరిగాయి. సిఐటియు అల్లూరి జిల్లా కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోనంగి చిన్నయ్య పడాల్, వి.ఉమామహేశ్వరరావు, జిల్లా సహాయ కార్యదర్శి సుందర్రావు ఆధ్వర్యంలో సిఐటియు అఖిలభారత మహాసభ జయప్రదం కోసం పలు ప్రచార కార్యక్రమాలు చేపట్టారు. అఖిల భారత మహాసభలో భాగంగా ఈ నెల 4న విశాఖలో జరిగే సిఐటియు మహా ప్రదర్శన, బహిరంగ సభకు భారీగా తరలివెళ్లేందుకు మన్యంలోని అన్ని ప్రాంతాల్లో కార్మికులు సమాయత్తం అవుతున్నారు. పాడేరు ఏజెన్సీ నుంచి సుమారు 5 వేల మంది కార్మికులు తరలివెళ్లనున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు వెల్లడించారు.


మాట్లాడుతున్న శివప్రసాద్

గ్రంథాలయాలతోనే ప్రజా చైతన్యం

ప్రజాశక్తి-గాజువాక

ప్రజల చైతన్యం కోసం గ్రంథాలయాలు అవసరమని గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ నాయకులు వల్లూరి శివప్రసాద్ అన్నారు. ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏడు రోజులుగా జరుగుతున్న శ్రామిక ఉత్సవ్‌లో భాగంగా సాహిత్య వేదికపై శుక్రవారం 'గ్రంథాలయాల ఆవశ్యకత - సవాళ్లు ' అనే అంశంపై చర్చావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల చైతన్యం, జ్ఞాన సంపద, మానవత విలువల కోసం గ్రంథాలయ ఉద్యమం చేపట్టాల్సి ఉందన్నారు. ప్రజలు చెల్లించే పన్నుల్లో 8 శాతం గ్రంథాలయాలకు కేటాయించాలని, 1960లో ప్రకాశం పంతులు చట్టం చేస్తే, ఆ చట్టం ఇప్పుడు అమలు కావడం లేదని చెప్పారు. గ్రంథాయ వ్యవస్థను నిర్వీర్యం చేయాలని పాలకులు 1980లోనే ప్రయత్నాలు మొదలు పెట్టారని గుర్తుచేశారు. కర్ణాటక ప్రభుత్వం 3,576 గ్రంథాలయ పోస్టులు నియామకం చేపట్టిందన్నారు. తమిళనాడు ప్రభుత్వం సంవత్సరానికి రూ.100 కోట్లు గ్రంథాలయాలకు పుస్తకాలు కొనుగోలు చేయడానికి కేటాయించిందన్నారు. మన రాష్ట్రంలో ఏడాది రూ.140 కోట్లు గ్రంథాలయాల నిర్వహణకు ఇవ్వాల్సి ఉండగా, రూ40 కోట్లు ఇచ్చి, మిగతా రూ.100 కోట్ల కోసం ఏమీ చెప్పడం లేదన్నారు. భవంతులు కడితే అభివృద్ధి కాదని, పిల్లలు జ్ఞానసంపద కూడా సంపాదించాలని అభిప్రాయ పడ్డారు. విద్యా వ్యవస్థలో కూడా బట్టి విధానం ర్యాంకులే తప్ప కొత్తదనం లేదన్నారు. ప్రభుత్వాలు ఓట్లు రాబట్టుకోవడానికి చూస్తున్నాయి గాని గ్రంథాలయ అభివృద్ధికి ప్రయత్నించడం లేదని అసంతృప్తి వ్యక్తంచేశారు. గ్రంథాలయ శాఖ అనేది స్వతంత్రంగా ఉండాలి తప్ప విద్యా శాఖలో ఉండకూడదని స్పష్టంచేశారు. గ్రంథాలయాల ఏర్పాటు కోసం ప్రభుత్వంతో పాటు మనం కూడా కృషి చేయాలని కోరారు. పిల్లలతో పుస్తక పఠనం చేయించాలన్నారు.

సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి కెంగార మోహన్ మాట్లాడుతూ గతంలో గ్రంథాలయాలకు స్వయం ప్రతిపత్తి ఉండేదన్నారు. గ్రంథాలయాల్లో ఉద్యోగ నియామకాలు చేపట్టడం లేదని, ఆరేళ్లుగా పుస్తకాలు కొనుగోలు చేయడం లేదని చెప్పారు. గ్రంథాలయ వ్యవస్థ సంక్లిష్టమైన పరిస్థితుల్లో ఉందన్నారు. గ్రంథాలయాలు గ్రామాల్లో కూడా విస్తరించాలని ఆకాంక్షించారు. ఆంధ్రా యూనివర్సిటీ లైబ్రరీ ప్రొఫెసర్ ధనరాజు మాట్లాడుతూ ప్రస్తుతం గ్రంథాలయాలు కొన ఊపిరితో నడుస్తున్నాయని అన్నారు. మేధావులు వికసించే చోట ప్రశ్నించేతత్వం పెరుగుతుందని తెలిపారు. విద్యావంతుల మౌనం వీడాలని కోరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధికారి కుమార్ రాజా మాట్లాడుతూ సెస్ బకాయిలు వసూలైన వెంటనే అభివృద్ధికి తోడ్పడతామని తెలిపారు. పౌర గ్రంథాలయ సేవాసమితి అధ్యక్షులు బి.ఎల్ నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు. అనంతరం మెమోంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు.


పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న జిసిసి ఎమ్‌డి కల్పనాకుమారి, చిత్రంలో వెంకటేశ్వరరావు

పుస్తక మహోత్సవాన్ని సందర్శించిన జిసిసి ఎమ్‌డి

ప్రజాశక్తి-గాజువాక

శ్రామిక ఉత్సవ్ వద్ద ఏర్పాటు చేసిన విశాఖ పుస్తక మహోత్సవాన్ని గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ వైస్ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ కల్పనా కుమారి శుక్రవారం రాత్రి సందర్శించారు. ఈ సందర్భంగా పుస్తకాల స్టాల్స్‌లో కలియదిరిగారు. అవసరమైన పుస్తకాలను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజాశక్తి డిప్యూటీ ఎడిటర్ రాంభూపాల్, జనరల్ మేనేజర్ వెంకటేశ్వరరావు, ప్రజాశక్తి బుక్ హౌస్ నిర్వాహకులతో ఆమె మాట్లాడుతూ.. ఎంతమంది వస్తున్నారు.. ఏయే పుస్తకాలు కొనుగోలు చేస్తున్నారు ? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె పుస్తకాలు కొనుగోలు చేశారు. చాలా సమాచారంతో కూడిన పుస్తకాలను అందుబాటులో ఉంచారని, పుస్తక ప్రదర్శన అద్భుతంగా ఉందని కితాబిచ్చారు. ఇలాంటి పుస్తక ప్రదర్శనను మళ్లీ ఏర్పాటుచేయాలని కోరారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
విజయనగరం, పార్వతీపురం మన్యం
శనివారం 3 జనవరి 2026




థింసా నృత్యంతో ఆకట్టుకున్న గిరిజన కళాకారులు



డ్యాన్సులతో హుషారెక్కిస్తున్న యువత



డ్రమ్స్ మోగిస్తూ మహిళల సందడి


ఎర్రజెండా గొప్పతనాన్ని వివరిస్తూ మహిళా కళాకారుల నృత్యం


అభ్యుదయ గేయాల ఆలాపన

చివరి రోజూ అదే జోరు


ముగిసిన శ్రామిక ఉత్సవ్ • అనూహ్య స్పందన


హీరోయిన్ గీత సైని

ప్రజాశక్తి - ప్రత్యేక ప్రతినిధి

ఆట, పాట, మాటలతో.. ప్రదర్శనలతో ఆద్యంతం కళాకారులు... ఆహూతుల్లో ఉత్సాహాన్ని నింపారు. సిఐటియు అఖిల భారత మహాసభ నేపథ్యంలో ఏర్పాటుచేసిన శ్రామిక ఉత్సవ్ శుక్రవారం ముగిసింది. ఏడు రోజులపాటు నిర్వహించిన కార్మికుల పండగ ఉత్సాహ పూరితంగా సాగింది. ప్రజానాట్య మండలి కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు, పాడిన పాటలు, గేయాలు.. పాలకులు, పెట్టుబడిదారుల గుండెల్లో తూటాల్లా పేలాయి. ఆద్యంతం చైతన్యాన్ని నింపాయి. జివిఎంసి కళాకారుల 'తీన్ మార్' సభికుల్లో ఉత్సాహాన్ని నింపింది. ఉపాధ్యాయులు జి.గౌరినాయుడు రాసిన 'నా దేశ గత చరిత్ర నెత్తుటి మరకే... ఐనా నా తల్లి మనసు మీగడ తరగ' అంటూ గత దేశ చరిత్రను, ప్రస్తుత దేశ పరిస్థితులను అన్వయిస్తూ వివరించారు కళాకారులు. 'మృత వీరుల చెరగని మువ్వన్నెల పతాకా.. విశ్వ వీణ తంత్రులై.. విమల గానమౌతుందని..' అంటూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో అమరులైన త్యాగధనుల స్ఫూర్తిని నింపుకుని పోరాడాలని, తద్వారానే పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టగలమని వివరించే ప్రయత్నం చేశారు. 'రాతి గుండె చప్పుడు.. జలియన్ వాలాబాగ్ .. ప్రవహించే వాగులు వెచ్చని నెత్తుటి వాగు..' అంటూ ప్రజానాట్య మండలి కళాకారులు పాడిన పాట సభికులను ఆలోచింపజేసింది. 'పట్టు పట్టక్క... జెండా పట్టక్క.. సిఐటియు నీకు నాకు అండదండక్క' అంటూ విజయనగరం జిల్లా అంగన్వాడీలు ప్రదర్శించిన కోలాటం ఆద్యంతం ఆసక్తి కలిగించింది. కిశోర బాలికలకు నైతిక విలువల పెంపుదలకు అంగన్వాడీలు చేస్తున్న కృషిని వివరించారు 'ఒకరిద్దరు పిల్లలు చాలు.. ఆడపిల్లలే మేలని' పేర్కొంటూ పాడుతూ.. ప్రదర్శించిన కోలాటం ప్రదర్శన ఆకట్టుకుంది. 'సిఐటియు జెండా ఎత్తి.. మనమంతా దండెత్తి.. హక్కులను సాధిద్దాం..' అంటూ అంగన్వాడీల కోలాటం ప్రదర్శన ద్వారా వారు చేపట్టిన పోరాట పటిమను వివరించారు. అంగన్వాడీ ప్రాజెక్టును గంగలో కలిపేస్తే ఊరుకోబోమంటూ కోలాట ప్రదర్శన ద్వారా పాలకులను హెచ్చరించారు. 'సిఐటియు సంఘమో.. పోరాటాల రంగమో..' అంటూ అంగన్వాడీలు కోలాట ప్రదర్శన ద్వారా సిఐటియు విశిష్టతను వివరించారు. వారానికి రెండు గుడ్లు పెట్టాలని చెబుతారు.. అప్పు తెచ్చి వండి పెడితే.. కిరాణా దుకాణం యజమానికి సకాలంలో డబ్బులు చెల్లించుకుంటే పడే ఇబ్బందులను, అవస్థలను ప్రస్తావించారు అంగన్వాడీలు. 'హల్లా బోల్' వీధినాటిక ప్రదర్శిస్తున్న ప్రజా కళాకారుడు సఫ్దార్ హష్మీ ఇదే రోజున నాటి కాంగ్రెస్ పాలకుల చేతిలో నడి రోడ్డుపై అత్యంత కిరాతకంగా హత్య చేయబడ్డాడని ప్రజానాట్య మండలి కళాకారులు గుర్తు చేస్తూ, ఆయనను స్మరించుకుంటూ తొలుత హష్మీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళారంగాన్ని అప్పటి పాలక వర్గాలు తమ ప్రచార బాకాగా మలుచుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకించాడు హష్మీ. ఆయన స్ఫూర్తితో పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా ఉద్యమించడమే మనమిచ్చే ఘన నివాళి అని కళాకారులు స్పష్టం చేశారు.






ప్రదర్శనలతో ఆకట్టుకున్న కళాకారులు


శ్రామిక ఉత్సవ్‌కు హాజరైన ప్రజానీకం


సిఐటియు అఖిల భారత నాయకులకు ప్రాజెక్టు గురించి వివరిస్తున్న విద్యార్థులు

'శ్రామిక ఉత్సవ్'లో విజ్ఞాన పరిమళాలు

ముగిసిన సైన్స్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ

శాస్త్ర విజ్ఞాన ప్రచారాన్ని ప్రోత్సహించాల్సిన ప్రభుత్వాలు మూఢ విశ్వాసాలను ప్రజల్లో పెంచి పోషిస్తూ, జనాల మధ్య కుల, మత విద్వేషాలను రెచ్చగొడుతూ కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను దోచిపెడుతున్నాయని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి నాగేశ్వరరావు విమర్శించారు. గత ఏడు రోజులుగా ఆంధ్రా యూనివర్సిటీ ఎగ్జిబిషన్ గ్రౌండ్లో సిఐటియు 18వ అఖిలభారత మహాసభ సందర్భంగా ఏర్పాటుచేసిన శ్రామిక ఉత్సవ్‌లో భాగంగా జన విజ్ఞాన వేదిక నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ శుక్రవారం ముగిసింది. ముగింపు సమావేశంలో ఎ.వి.నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో శ్రామిక ఉత్సవ్ ఆహ్వాన సంఘం కన్వీనర్ డాక్టర్ రమాప్రభ మాట్లాడుతూ కార్మికుల కష్టంతో చెమట చుక్కతో సంపదని సృష్టిస్తే ఆ సంపదను కొంతమంది పెట్టుబడిదారులకు ప్రస్తుత ప్రభుత్వాలు ధారదత్తం చేస్తున్నాయని విమర్శించారు. ఆదిమ సమాజం నుంచి ఈనాటి ఆధునిక సమాజం వరకు మనిషి మెదడులో తలెత్తిన ప్రశ్న.. అప్పటినుంచి ఇప్పటివరకు పాలకులను ప్రశ్నించడం ద్వారానే అనేక నూతన ఆవిష్కరణలు వెలుగుచూశాయని, అవన్నీ కూడా ప్రజలు, కార్మికుల సౌకర్యవంతమైన జీవనానికి దోహదపడ్డాయని గాజువాక ప్రజా వైద్యశాల డాక్టర్ రమేష్ కుమార్ అన్నారు. ప్రజల ఓట్లతో గెలిచిన ప్రభుత్వాలు విద్యా, కార్మిక, కర్షక, రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ ప్రజల హక్కులను కాల రాస్తున్నాయన్నారు. ప్రజలందరూ సంఘటితమై పోరాడితే తప్ప ఈ పరిస్థితి నుంచి బయట పడలేమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, విద్య, వైద్య రంగాలను అంగట్లో సరుకుగా మార్చివేస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ వైఎల్ నరసింహారావు మాట్లాడుతూ శాస్త్రీయ ఆలోచన, సైన్స్ మనిషి జీవితంలో అంతర్భాగమన్నారు. ప్రజల దైనందిన జీవితం ఆచరణాత్మకంగా ఉండాలని, కానీ ప్రభుత్వాలు ప్రజల్లో మూఢవిశ్వాసాలను పెంచి పోషిస్తూ వారిని ప్రశ్నించే వారిపట్ల ద్వేష భావాన్ని రగిలిస్తూ దమనకాండకు, దాడులకు, అక్రమ అరెస్టులకు పురిగొల్పే విధంగా వ్యవహరిస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమానికి జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు మురళీధర్ అధ్యక్షత వహించారు. ఏడు రోజుల పాటు జరిగిన ఈ సైన్స్ ఎగ్జిబిషన్లో సుమారు ఏడు వేల మంది ప్రజలు, విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని తిలకించారు. అనంతరం ఎగ్జిబిషన్లో పాల్గొన్న కాలేజీలకు విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గాయత్రి మెడికల్ కాలేజ్ ప్రొఫెసర్ ఇ.రవికిరణ్, ప్రిన్సిపల్ డాక్టర్ పి.కృష్ణారెడ్డి, కెమికల్ ఇంజనీరింగ్ గ్రీన్వేడ్స్ ఫైర్ అండ్ సేఫ్టీ కాలేజ్ కోఆర్డినేటర్ సవిత, పెందుర్తి గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ సీనియర్ లెక్చరర్ డాక్టర్ శ్రీనివాస్, సాయి గణపతి పాలిటెక్నిక్ కాలేజీ కన్వీనర్ డి.కిషోర్ కుమార్, విశాఖ ఇంజనీరింగ్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ వరప్రసాద్, విజ్ఞాన్ ఇంజనీరింగ్ కాలేజీ కోఆర్డినేటర్ డాక్టర్ సంపదక్షిణమూర్తి, జన విజ్ఞాన వేదిక విశాఖ జిల్లా నాయకులు వై.ఆర్.కె. ప్రసాద్, జెవివి రాష్ట్ర నాయకులు కె.త్రిమూర్తులురెడ్డి, కె.శేషగిరిరావు, జిల్లా నాయకులు గోపాలరావు, రత్నారావు, ఆట్ల చంద్రశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎల్.నర్సింహారావు

వర్గ పోరాటంతోనే సమాజ మార్పు

'శ్రామిక ఉత్సవ్'లో ప్రముఖ దర్శకులు రాజమురుగన్


హష్మీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దర్శకుడు రాజమురుగన్, తదితరులు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ

వర్గ పోరాటంతోనే సమాజ మార్పు సాధ్యమని ప్రముఖ తమిళ దర్శకుడు రాజమురుగన్ అన్నారు. సిఐటియు 18వ అఖిల భారత మహాసభ సందర్భంగా ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏడు రోజులుగా జరుగుతున్న 'శ్రామిక ఉత్సవ్' శుక్రవారం ఘనంగా ముగిసింది. చివరి రోజు 'ఆహారం, ఆరోగ్యం, విద్య, ఉపాధి - హక్కులకై ఉద్యమిద్దాం' అన్న థీమ్‌తో కార్యక్రమాలు జరిగాయి. ఉత్సవ్‌కు ముఖ్య అతిథిగా విచ్చేసిన రాజమురుగన్ మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాత నటుడు చార్లీ చాప్లిన్ తన మూగ సినిమాల ద్వారా ఆకలి విలువను అద్భుతంగా చిత్రీకరించారని కొనియాడారు. చాప్లిన్ అమెరికా, ఇంగ్లాండ్ వంటి ధనిక దేశాల్లో పెరిగినా, ఆయనకు ఆకలి గురించి ఎలా తెలుసని అడిగితే 'నేను కమ్యూనిస్టును కాబట్టే ఆకలి విలువ తెలిసింది' అని ఆయన చెప్పుకొచ్చిన విషయాన్ని రాజమురుగన్ గుర్తుచేశారు. ఆకలిని ప్రతిబింబించేందుకు భాషతో పనిలేదని ఆయన నిరూపించారన్నారు. నేటి భారతదేశంలో మితవాద శక్తులు సమాజాన్ని విడదీస్తున్నాయని, వారికి వ్యతిరేకంగా మనం ప్రేమ, త్యాగం వంటి విలువలను ఆయుధాలుగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రపంచ సంపదలో మెజారిటీ వాటా కేవలం 60 వేల మంది చేతుల్లోనే ఉందని, పాలకులు కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. కుల, మత బేధాలను విస్మరించి సోషలిజం సాధన కోసం వర్గ పోరాటమే ఏకైక మార్గమని ఆయన స్పష్టం చేశారు.

సభాధ్యక్షులు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. కష్టజీవుల శ్రమ దోపిడీకి గురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఆయన ఎండగట్టారు. మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తూ సామాన్యులకు వైద్యాన్ని దూరం చేస్తున్నారని, విద్యా చట్టం పేరుతో కేవలం డబ్బున్న వారికే చదువును పరిమితం చేస్తున్నారని విమర్శించారు. చదువుకున్న యువతకు నామమాత్రపు జీతాలతో కార్పొరేట్ కంపెనీలలో బానిస చాకిరీ మిగిలిందని, గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ఆంక్షల పేరుతో నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. నెలకు ఐదు కేజీల బియ్యంతో ఒక కుటుంబం ఎలా జీవించగలదని ఆయన పాలకులను నిలదీశారు.



మాట్లాడుతున్న దర్శకుడు రాజమురుగన్, వేదికపై ఉమామహేశ్వరరావు, అట్టాడ సృజన్, శ్రీచరణ్, గీత సైని

ఘనంగా ముగింపు

కార్యక్రమం ముగింపులో భాగంగా వారం రోజుల పాటు వివిధ విభాగాల్లో సహకరించిన వాలంటీర్లకు, కళాకారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో యువ దర్శకుడు అట్టాడ సృజన్, 'కన్యాకుమారి' చిత్ర నటులు శ్రీచరణ్, గీత సైని, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, శ్రామిక ఉత్సవ్ కన్వీనర్ కె.రమాప్రభ, కుమార మంగళం, మోహన్‌రావు, సిద్దిరెడ్డి జోగిరాజు పాల్గొన్నారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న సీతారాం ఏచూరి (ఫైల్)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ వెనుక తెలుగు ప్రజల చారిత్రక పోరాట నేపథ్యం వుంది. 'విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు' నినాదంతో 32 మంది ప్రాణాల బలిదానంతో తెలుగు ప్రజలు ఏకోన్ముఖంగా పోరాడి సాధించుకున్న ఘనత దీనిది. ఉక్కు పరిశ్రమ పురోగమనంలో కార్మికులు, ఉద్యోగుల కఠోర శ్రమ వుంది. ప్రభుత్వాల సహాయ నిరాకరణ, కుట్రలపై ప్రతిఘటన వుంది. ఆది నుంచి ప్రభుత్వాల కుట్రలు, కుతంత్రాలను ఎదురొడ్డి ఉక్కు పరిశ్రమను నిలబెట్టుకోవడంలో ప్రజల పాత్ర వుంది. సోషలిస్టు రష్యా సహకారం వుంది. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించేందుకు నాలుగున్నరేళ్లుగా కుట్రలు చేస్తున్నా సిఐటియు నేతృత్వాన కార్మికవర్గం అలుపెరగని పోరాటాలతో తిప్పికొడుతూ వస్తోంది.

ఉక్కు పరిరక్షణకు సమరశీల పోరాటాలు

సిఐటియు నేతృత్వాన ఉద్యమిస్తున్న కార్మికవర్గం



బైక్‌ర్యాలీ చేపడుతున్న వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, సిఐటియు నాయకులు (ఫైల్)

ప్రజాశక్తి – విశాఖపట్నం

అది 1963వ సంవత్సరం. ఐదో స్టీల్‌ప్లాంట్ నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అప్పటికే భిలాయ్, బొకారో, రూర్కెలా, దుర్గాపూర్‌లో స్టీల్‌ప్లాంట్‌లు ఉండడంతో, సముద్ర తీరానవున్న విశాఖపట్నం అనుకూల స్థలమని ఆంగ్లో ఇండియన్ కన్సార్టియం ప్రతిపాదించింది. విశాఖలో స్టీల్‌ప్లాంట్ నిర్మించాలని 1966 జులై 1న శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానించి, కేంద్ర ప్రభుత్వానికి పంపింది. దీనికి ఆనాటి కేంద్ర కాంగ్రెస్ ప్రభుత్వం సానుకూలంగా లేదు. అయితే, వెనుకబడిన విశాఖపట్నంలో స్టీల్‌ప్లాంట్ నిర్మిస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, ఉపాధి దొరుకుతుందని నాడు అందరిలో ఆశ చిగురించింది. విశాఖలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేయాలని 1966 అక్టోబర్ 21న విద్యార్థులు ప్రదర్శన చేపట్టారు. 'విశాఖ ఉక్కు –



వైజాగ్ స్టీల్‌ప్లాంట్

ఆంధ్రుల హక్కు' అని నినదించారు. రైళ్లను ఆపేశారు. ఉద్యమ నినాదం తెలుగు ప్రజల్లోకి బలంగా వెళ్లింది. సాధించుకోవాలన్న పట్టుదల పెరిగింది. ఇది భరించలేని ప్రభుత్వం 1966 నవంబరు 1న ఉద్యమకారులపై కాల్పులు జరిపి 9 మందిని బలితీసుకుంది. దీన్ని నిరసిస్తూ వీధుల్లోకి వచ్చి ఆందోళనకు దిగిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు, యువకులు, ప్రజలపై ప్రభుత్వం దమనకాండకు దిగి 32 మంది ప్రాణాలను బలిగొంది.

కాల్పులను నిరసిస్తూ, విశాఖపట్నంలో స్టీల్‌ప్లాంట్ నిర్మించాలన్న డిమాండ్‌తో పుచ్చలపల్లి సుందరయ్య, తరిమెల నాగిరెడ్డి సహా 53 మంది కమ్యూనిస్టు ఎమ్మెల్యేలు, తెన్నేటి విశ్వనాథం వంటి 14 మంది ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, ఏడుగురు ఎంపీలు రాజీనామా చేసి ఉద్యమంలో పాల్గొన్నారు. అమృతరావు నిరాహారదీక్ష ప్రారంభించారు. ప్రజాపోరాటాల ధాటికి తట్టుకోలేక నాటి కేంద్ర ప్రభుత్వం దిగొచ్చింది. 1970 ఏప్రిల్ 17న నాటి ప్రధాని ఇందిరా గాంధీ విశాఖలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటును ప్రకటించి, 1971 జనవరి 20న పైలాన్ ఏర్పాటుచేశారు. విశాఖ ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి 16,500 మంది రైతులు ముందుకొచ్చి, 64 గ్రామాలు ఖాళీచేసి 22 వేల ఎకరాల భూములిచ్చారు.

కేంద్రం సహాయ నిరాకరణ : అప్పులతో వడ్డీల భారం

స్టీల్ అథారిటీ ఇండియా లిమిటెడ్ (సెయిల్) నుంచి విశాఖ స్టీల్ ప్లాంట్‌ను 1982 ఫిబ్రవరి 18న వేరుచేశారు. 20 మిలియన్ టన్నుల సామర్థ్యంతో నిర్మించాల్సిన స్టీల్‌ప్లాంట్‌ను రేషనలైస్డ్ కాన్సెప్ట్ పేరుతో 3.4 మిలియన్ టన్నులకు పరిమితం చేసి కేంద్రం కేవలం రూ.4,889 కోట్లు కేటాయించింది. మిగిలిన డబ్బులు వివిధ బ్యాంకుల్లో అప్పులు చేసి 3.4 మిలియన్ టన్నుల సామర్థ్యంతో స్టీల్‌ప్లాంట్‌ను నిర్మించుకొని 1991లో ఉత్పత్తి ప్రారంభించారు.

దేశంలో ఇతర స్టీల్‌ప్లాంట్లను కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించగా, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర సహకారం లేకపోవడంతో, అప్పులుచేసి నిర్మించడంతో వడ్డీల భారం పెరిగింది. వడ్డీలు పెరిగి నష్టాలు రావడంతో 1999లో బిజెపి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను బిఐఎఫ్ఆర్‌కు నివేదించి, ప్రయివేటీకరణ వాదన ముందుకు తెచ్చింది. దీనికి వ్యతిరేకంగా పోరాటం జరగడంతో రూ.1500 కోట్లు కేటాయించింది. స్టీల్‌ప్లాంట్‌కు ప్రభుత్వాలు సొంత గనులు కేటాయించకపోయినా, బహిరంగ మార్కెట్‌లో గనులు కొనుక్కొని, 120 శాతం సామర్థ్యంతో నడిచేలా కార్మికులు, ఉద్యోగులు విశేష కృషిచేశారు. 2002 నుంచి 2015 వరకు సుమారు రూ.12,900 కోట్లు లాభాలు వచ్చాయి. ప్రభుత్వం కేటాయించిన సొమ్మును ప్లాంట్ తిరిగి చెల్లించగలిగింది. అనంతరం మిగులు సొమ్ముతో పాటు, రూ.18 వేల కోట్లకుపైగా అప్పుచేసి 7.3 మిలియన్ టన్నుల సామర్థ్యానికి స్టీల్‌ప్లాంట్‌ను విస్తరించేందుకు ప్రయత్నాలు జరిగాయి. 2008 నుంచి 2019 వరకు 10 వేల పర్మినెంట్, కాంట్రాక్ట్ ఉద్యోగాలు వచ్చాయి. నిర్వాసిత కుటుంబాలకు, ఎస్‌టి, ఎస్‌టి, బిసి, మైనారిటీ, మాజీ సైనిక ఉద్యోగులు, మహిళలు, వికలాంగులకు ఉద్యోగాలు లభించాయి.

వెంటాడుతున్న ముడి ఖనిజ సమస్య

ప్లాంట్ సామర్థ్యం పెంచుకున్నా, ముడిఖనిజం సమస్య స్టీల్‌ప్లాంట్‌ను వెంటాడుతూనే వుంది. కేంద్ర ప్రభుత్వం దేశంలోని ప్రైవేటు, ప్రభుత్వ స్టీల్ పరిశ్రమలతోపాటు, స్టీల్‌ప్లాంట్ నిర్మాణమే చేపట్టని పోస్కోకు సైతం ఐరన్‌ఓర్ గనులు కేటాయించింది. కానీ, పభుత్వరంగ సంస్థ అయిన విశాఖ స్టీల్ ప్లాంట్‌కు నేటికీ ఐరన్‌ఓర్ కేటాయించలేదు. సొంత గనులున్న స్టీల్‌ప్లాంట్లకు ఒక టన్ను ఉత్పత్తికి కేవలం రూ.500 ఖర్చు అవుతుండగా, విశాఖ స్టీల్‌ప్లాంట్ మార్కెట్‌లో ఐరన్ ఓర్ టన్నును రూ.5 వేల నుంచి రూ.8 వేలకు కొంటోంది.

హైకోర్టు ఆదేశాలు బేఖాతరు

సెయిల్ నుంచి నుంచి స్టీల్‌ప్లాంట్‌ను వేరుచేసినప్పుడు బైలదిల్లాలోని 4, 5 బ్లాకుల గనులను విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌కు కేటాయించి, ఐరన్ ఓర్ సరఫరా చేస్తామని నమ్మబలికారు. అయితే మన రాష్ట్రంలోని ఐరన్ ఓర్ గనులను విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేటాయించాలని సిఐటియు హైకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించే అంశాన్ని పరిశీలించాలని నాటి ప్రభుత్వానికి ఆదేశించారు. అయినా గనులు కేటాయించకుండా. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇబ్బందులు పాల్జేస్తున్నాయి. సముద్ర తీరాన స్టీల్‌ప్లాంట్ నిర్మించినట్టయితే రవాణాకు అనుకూలమై, అత్యంత తక్కువ ఖర్చుతో ముడిసరుకును దిగుమతితోపాటు, స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తులను చౌకగా ఇతర దేశాలకు ఎగుమతి చేసుకోవచ్చని భావించారు. అనుబంధంగా పిపిపి విధానంలో గంగవరంలో పోర్టు నిర్మించినా, దాన్ని అదానీకి కట్టబెట్టారు. ఆ ప్రభావం స్టీల్‌ప్లాంట్‌పై పడింది. ముడిసరుకు రాకుండా ఇబ్బందులను సృష్టించడంతో రూ.మూడు వేల కోట్లు పైగా నష్టం వాటిల్లింది.

పరిశ్రమలు, ప్రభుత్వ రంగ సంస్థలు ఆధునిక దేవాలయాలంటూ నాటి ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్ వంటి పరిశ్రమలను ఏర్పాటు చేస్తే, వ్యాపారం ప్రభుత్వ పని కాదంటూనే ప్రభుత్వ సంస్థలు చావడానికే పుట్టాయంటూ మోడీ ప్రభుత్వం ప్రజల సొమ్ముతో ఏర్పాటైన వీటిని పెట్టుబడిదారులకు కట్టబెడుతోంది. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను నూరు శాతం అమ్మాలని 2021 జనవరి 27న నిర్ణయించింది.

ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన విశాఖ ఉక్కుపై ప్రత్యక్షంగానూ, పరోక్షంగా ఆధారపడి సుమారు లక్ష మంది జీవిస్తున్నారు. రాష్ట్రంలోనే అధిక తలసరి ఆదాయం గాజువాకకు ఉండడానికి విశాఖ ఉక్కు కారణం. అయినా దీన్ని ప్రైవేటీకరించడానికి కుట్రలు చేస్తుండటంతో సిఐటియు నేతృత్వాన కార్మికవర్గం అలుపెరగని పోరాటం చేస్తోంది. ఆ ఉద్యమాన్ని పట్టించుకోకుండా.. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తాం లేదా మూసేస్తామంటూ మోడీ సర్కారు ముందుకెళ్తోంది. ఈ క్రమంలోనే ఉత్పత్తికి అవసరమైన ముడిసరుకు సరఫరాను కావాలనే నిలిపేస్తోంది. ఉద్యోగులపై ఆర్థిక దాడి చేస్తోంది. కొన్ని నెలలుగా సకాలంలో జీతాలు చెల్లించడంలేదు. ఉద్యోగులను విఆర్‌ఎస్ పేరుతో బయటకు పంపేస్తున్నారు. కాంట్రాక్టు కార్మికులను తొలగించే కుట్రలు సాగుతున్నాయి. ప్లాంట్‌ను రక్షిస్తామని హామీనిచ్చి గెలిచిన టిడిపి కూటమి ప్రభుత్వం నేడు దుర్మార్గ వైఖరిని అవలంబిస్తోంది. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని ఆపుతున్నట్లు స్పష్టమైన ప్రకటన చేయించాలని చంద్రబాబు, పవన్‌లను సిఐటియు డిమాండ్ చేస్తోంది.



ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు (ఫైల్)

మహాత్మా గాంధీ పేరునే కొనసాగించాలి

ప్రజాశక్తి- మెంటాడ

గ్రామీణ పేదలకు బాసటగా ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును మార్చడం అమానుషమని ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు అన్నారు. శుక్రవారం లోతుగెడ్డ గ్రామంలో ఉపాధి వేతన దారులతో కలిసి ఆయన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి కంకణం కట్టుకుందని, అందులో భాగంగానే పథకం పేరు మార్పునకు శ్రీకారం చుట్టిందని అన్నారు. ఈ పథకం ద్వారా వలసదారులు తగ్గు ముఖం పట్టారని, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలు జీవనం సాగిస్తున్నారని ఆయన తెలిపారు. అనంతరం గోడపత్రికను విడుదల చేశారు. యథావిధిగా మహాత్మా గాంధీ పేరును కొనసాగించాలని,



గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న నిరసన కారులు

లేనియెడల ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సిహెచ్ కృష్ణవేణి, వ్యవసాయ కార్మిక సంఘ మండల అధ్యక్షురాలు సన్యాసమ్మ, పావని, వీరమ్మ, నరసమ్మ పాల్గొన్నారు.

నేడు ప్రజా దర్బార్

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ప్రజా సమస్యల పరిష్కారం కోసం శనివారం లక్కవరపుకోట లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముందుగా ఉదయం 8గంటలకు వేపాడ మండలం బల్లంకి గ్రామంలో గల రైవాడ కాలువ బ్రిడ్జి నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం అనంతరం ఉదయం 10గంటలకు 'ప్రజాదర్బార్' కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఆమె కోరారు.

భజన గురువులకు సత్కారం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీ పరిధి జరజాపుపేట రాధాకృష్ణ, బైటో భజన బృందం గురువులకు శుక్రవారం స్థానిక సత్య జ్ఞానానంద ఆశ్రమంలో నగరపంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, ఆశ్రమం నిర్వహణ కమిటీ అధ్యక్షులు, గరివిడి ఎంఇఒ పోలుబోతు రామారావు, ఆశ్రమ పీఠాధిపతి సత్య జ్ఞానంద సత్కరించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ రామారావు మాట్లాడుతూ జరజాపుపేట పరిసర ప్రాంతాలకు ఆధ్యాత్మిక ఆది కేంద్రమైన శ్రీసత్య జ్ఞానానంద ఆశ్రమం సదాచార సాంస్కృతిక సంప్రదాయ పరిరక్షణలో భాగంగా భజన గురువులకు సత్కరించడం గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రంమలో గ్రామస్తులు పాల్గొన్నారు.

పేదల సేవే పరమార్థం : బొత్స

ప్రజాశక్తి - పూసపాటి రేగ

పేదల సేవే పరమార్థమని బొత్స చైతన్య అన్నారు. శుక్రవారం మండలంలోని లంకలపల్లిపాలెంకు చెందిన వ్యాధి గ్రస్తులకు ఆర్థిక సహాయం అందించారు. కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న అలబోయిన పైడిరాజుతో పాటు, లివర్ సమస్యతో బాధపడుతున్న ఆమె భర్తకు రూ. 20వేలు ఆర్థిక సహాయం అందించారు. అదే గ్రామానికి చెందిన కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఆవాల ఆసిరి రాములకు రూ. 10వేలు ఆర్థిక సహాయం అందించారు. భర్త మృతితో జీవనాధారం కోల్పోయిన నక్కాన గౌరి కుటుంబానికి మరో రూ. 10వేలు సహాయం చేశారు. ఈ సందర్భంగా బొత్స చైతన్య మాట్లాడుతూ తన తండ్రి బొత్స లక్ష్మణరావు సహాయంతో ఈ కుటుంబాలకు ఎల్లప్పుడూ తాను అండగా ఉంటానన్నారు. ఎలాంటి సహాయం అవసరమైనా తనని సంప్రదించాలని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పసుపులేటి మహేష్, దొండపాటి వాసుదేవరావు, కొప్పెర్ల సర్పంచ్ సంకాబత్తుల సత్తిబాబు, తొటపాలెం పతివాడ సత్యనారాయణ పాల్గొన్నారు.

మామిడి పంటలో సస్యరక్షణ చర్యలపై శిక్షణ

ప్రజాశక్తి- రాజాం

మండలంలోని సోపేరు గ్రామంలో శుక్రవారం మామిడి పంటలో సస్యరక్షణ చర్యలపై ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రం రస్తా కుంటుబాయి ఉద్యాన శాస్త్రవేత్త శ్రీనివాసరాజు మామిడి ఆశించు పురుగుల తెగుళ్ళపై రైతులకు అవగాహన కల్పించారు. తేనెమంచు, తామర పురుగులు పుష్ప గుచ్ఛం, పూతను తినే గొంగళి పురుగులు ఎక్కువగా మామిడి తోటలను ఆశించి నష్ట పరుస్తాయని తెలిపారు. మండల ఉద్యాన అధికారి సిహెచ్ ఉమామహేశ్వరి మాట్లాడుతూ ఉద్యాన శాఖలో అమలవుతున్న పథకాలపై అవగాహన కల్పించారు. మ్యాంగో ఫ్రూట్ కవర్స్ వాడటం వల్ల కాయ నాణ్యత పెరిగి మచ్చ తెగులు, పురుగులు నుండి రక్షణ లభిస్తోందన్నారు. ఈ మేరకు వాటిని 40శాతం రాయితీపై ఇస్తున్నామని రైతులు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ములగ రాము, ఎంపిటిసి కోటగిరి సూర్యారావు, మామిడి రైతులు ఎడ్ల అప్పలరాజు, ఇతర మామిడి రైతులు, విఎఎ సాయి కిరణ్ పాల్గొన్నారు.

కబ్జాల నుంచి చెరువులను కాపాడుకుందాం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

కాలుష్య కోరలు నుంచి, కబ్జాల నుంచి కాలువలను, చెరువులను కాపాడుకుందామని పర్యావరణవేత్త, న్యాయవాది బొబ్బిలి రామకృష్ణన పిలుపునిచ్చారు. ప్రకృతిని, పర్యావరణాన్ని కాపాడుకుందాం, భవిష్యత్తును రక్షించుకుందాం అనే నినాదంతో పర్యావరణ న్యాయ అక్షరాస్యత, సమాజ రక్షణ అనే అంశంపై న్యాయ అవగాహన సదస్సును జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు స్థానిక ఎవియన్.జూనియర్, డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ జల విధానం 2012 చెరువులు వంటి నీటి వనరులను ఆక్రమించకుండా, మళ్లించకుండా ఉండాలని సూచిస్తుందని గుర్తు చేశారు. చెరువుల పరిరక్షణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు, నీటిపారుదల, రెవెన్యూ శాఖలపై ఉంటుందన్నారు. ప్రభుత్వం సక్రమంగా పట్టించుకోకపోవడం వల్ల నేడు కాలువులు, చెరువులు కబ్జాకు గురవుతున్నాయన్నారు. ఎస్‌కోట, కొత్తూరు, భర్తాపురం, భవానీ నగర్, సీతంపేట, పోతనాపల్లి, గోస్తనీ నదీ సమీప కాలువ, ధర్మవరం, బొద్దాం, కళ్ళెంపూడి, నరవ తదితర గ్రామాల చెరువుల్లో పంచాయతీలు చెత్తను పంట కాలువల్లో పారబోస్తున్నాయని, ప్లాస్టిక్ వ్యర్థాలను తగలబెడతున్నారని చెప్పారు. స్థానిక విశాఖ రహదారి నుండి కొత్తూరు వరకు ప్రధాన పంట కాలువలు పూర్తిగా ఆక్రమణకు గురి అయినట్లు నివేదికలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ అరిగి దేముడు, మండల న్యాయ సేవల కమిటీ సూపరిండెంట్ కె. శ్రీనివాసరావు, కళాశాల డైరెక్టర్లు ఎ.రమేష్ నాయుడు, సాయి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.సత్యవేణి, అధ్యాపకురాలు కె.రమణి, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలతో ప్రచారం చేస్తున్న ఆర్‌టిసి ఉద్యోగులు

యువత నైపుణ్యానికి క్రీడలు దోహదం

ప్రజాశక్తి - పూసపాటి రేగ

యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు క్రీడా పోటీలు ఎంతో దోహదపడతాయని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అన్నారు. శుక్రవారం మండలంలోని ఎస్ఎంఎస్ ఫార్మా కంపెనీ ఎదురుగా ఉన్న మైదానంలో నిర్వహించిన నెల్లిమర్ల ప్రీమియర్ లీగ్ (ఎన్‌పిఎల్) క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. క్రీడాకారులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ, క్రీడలు కేవలం వినోదం మాత్రమే కాదని, అవి వ్యక్తిగత క్రమశిక్షణను, పట్టుదలను నేర్పుతాయని అన్నారు. నియోజకవర్గ యువతను అన్ని రంగాల్లో ప్రోత్సహించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో రాణించి నియోజక వర్గానికి మంచి పేరు తీసుకు రావాలని కోరారు. యువత కోసం మరిన్ని క్రీడా వేదికలను ఏర్పాటు



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఈ ప్రారంభోత్సవ వేడుకల్లో కూటమి నాయకులు, క్రీడా నిర్వాహకులు కోట్ల రఘు, బాలా అప్పలరాజు మాట్లాడుతూ ఈ పోటీలకు 80 క్రికెట్ జట్లు రాగా, 60 వరకూ వాలీ బాల్ టీమ్‌లు నమోదు చేసుకున్నాయన్నారు. 40 పాఠశాలల్లో క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

ప్రజాశక్తి - కొత్తవలస

పదో తరగతిలో ఈ ఏడాది శత శాతం ఉత్తీర్ణత సాధించాలని ప్రత్యేకాధికారి ఎం. అన్నపూర్ణ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఆమె శుక్రవారం సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యలో మెలకువలు మంచి క్రమశిక్షణ ప్రదర్శించాలని ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో మెలిగి ప్రతిభ కనపరచాలని శత శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. విద్యార్థి దశలో పదవ తరగతి చాలా కీలకమని ఈ దశలో మంచి మార్కులు సాధించి దేశానికి గర్వపడే విద్యార్థులుగా తయారవ్వాలని తెలిపారు. మండలంలో వివిధ స్కూల్ నుంచి 528 మంది విద్యార్థులు ఉన్నారని వారందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. అనంతరం ఎపి మోడల్ స్కూల్, అర్థన్నపాలెం, దెందేరు, బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కెజిబివి పాఠశాలలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ బండారు సత్యనారాయణ, జిల్లా పరిషత్ హై స్కూల్ హెచ్ఎం ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసిలో మాసోత్సవాలు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఆర్‌టిసిలో రహదారి భద్రత మాసోత్సవాలను, డోర్ డెలివరీ మాసోత్సవాలను డిపో మేనేజర్ కె సుదర్శన్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. డోర్ డెలివరీ మాసోత్సవాలు సందర్భంగా పట్టణంలోని ఆర్‌టిసి సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కరపత్రాలను పంచుతూ ప్రజలకు వివరించారు. అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా స్థానిక ఆర్‌టిసి డిపోలో జిల్లా ప్రజా రవాణాధి కారి వరలక్ష్మి, స్థానిక సిఐ నారాయణ మూర్తినాయుడు రహదారి భద్రతా వారోత్సవాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్, గ్యారేజ్, ఆఫిస్ సూపర్ వైజర్లు, సెక్యూరిటీ, గ్యారేజ్, ట్రాఫిక్, ఆన్ కాల్ డ్రైవర్లు అవుట్ సోర్సింగ్ గ్రౌండ్ బుకింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బడి బస్సులో అవకాశం కల్పించండి

ప్రజాశక్తి - వేపాడ

మండలంతో పాటు ఎస్‌కోట ఆర్‌టిసి డిపో పరిధిలో నడుపుతున్న బడి బస్సుల్లో ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగు లకు ప్రయాణ సౌకర్యం కల్పించాలని సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావు కోరారు. శుక్రవారం ఉత్తరాంధ్ర ఆర్‌టిసి రీజనల్ చైర్మన్ డి.దొరను కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా దొర మాట్లాడుతూ ఎస్ కోట పరిధిలో తిరుగుతున్న బడి బస్సుల్లో ప్రభుత్వ కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు ప్రయాణించే విధంగా చర్యలు



దొరకు వినతినిస్తున్న అప్పారావు

తీసుకుంటానని హామీ ఇచ్చారు. అయితే ఏ బడి బస్సులో మహిళా ఉద్యోగుల్ని ఎక్కించాలో ఆ బస్సు నెంబరు డ్రైవర్ పేరు తెలియజేయాలని కోరారు. అనంతరం అప్పారావు మాట్లాడుతూ విశాఖపట్నం నుండి సోంపురం మీదుగా వేపాడకు నైట్ హాల్ట్ బస్సు సౌకర్యం కల్పించడానికి సర్వే జరిపినా ఇంతవరకు బస్సు ఏర్పాటు చేయలేదని కోరగా వెంటనే స్పందించిన దొర బస్సుకు సౌకర్యం కల్పించాలని విశాఖ ఆర్‌టిసి యాజమాన్యంతో మాట్లాడి రెండు మూడు రోజుల్లో బస్సు వేయడానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు.

ఉగాది నాటికి గృహ ప్రవేశాలు

ప్రజాశక్తి - వేపాడ

ఉగాది నాటికి సామూహిక గృహ ప్రవేశాలు చేయాలని ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో శుక్రవారం హౌసింగ్ ఎఇ గంగాధర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో కలిసి 'ఉగాది నాటికి గృహప్రవేశాలు' అనే అంశంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో మొత్తం 165 ఇళ్లు మంజూరు చేశామని వీటి నిర్మాణాన్ని ఉగాది పండగ నాటికి పూర్తి చేసి సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమన్వయంతో పని చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ సూర్యనారాయణ, పాల్గొన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

ఫ్యామిలీ సర్వే పరిశీలన

మండల కేంద్రంలో జరుగుతున్న ఫ్యామిలీ సర్వేను మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ, ఎంపిడిఒ సూర్యనారాయణ, తహశీల్దార్ జె.రాములమ్మ పరిశీలించారు. ఫ్యామిలీ సర్వే ఈనెల 12 లోపు పూర్తి చేయాలని, కుటుంబం సంబంధించి సమగ్ర వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

ప్రజాశక్తి- శృంగవరపుకోట

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు ఆధ్వర్యంలో వినియోగదారుల హక్కులు, చట్టాలు అనే విషయంపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రూసా కోఆర్డినేటర్ కె.వాసుదేవరావు, క్రిస్టల్ మేనేజ్మెంట్ సర్వీసెస్ నుంచి వచ్చిన ఐ శ్రీనివాసరావు పాల్గొని విద్యార్థులకు వినియోగదారుల హక్కులు చట్టాలను గురించి వివరించారు.

ప్రపంచ తెలుగు మహాసభలకు బొంతలకోటి

ప్రజాశక్తి - బొబ్బిలి

గుంటూరులో ఈ నెల 3,4,5న జరగనున్న ప్రపంచ తెలుగు మహా సభలకు భాగవతం కళాకారుడు బొంతలకోటి శంకరరావు, బృంద సభ్యులకు ఆహ్వానం అందింది. 3న తూర్పు భాగవతం ప్రదర్శన చేసి అదేరోజు పూర్ణ కుంభ పురస్కారం అందుకోనున్నట్లు శంకరరావు చెప్పారు. ప్రపంచ తెలుగు మహాసభలకు ఆహ్వానం రావడం ఆనందంగా ఉందని కళాకారులు అన్నారు.



గాంధీ విగ్రహం వద్ద క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

గాంధీ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి

పింఛనర్ల సంఘం అధ్యక్షులు అప్పారావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గాంధీజీ ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా పింఛనర్ల సంఘం అధ్యక్షులు పెద్దింటి అప్పారావు అన్నారు. గాంధీ స్మారక నిధి పట్టణ శాఖ ఆధ్వర్యంలో స్టేట్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ వద్ద గల గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అప్పారావు మాట్లాడారు. ముందుగా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు, స్వాతంత్ర సమరయోధులను మర్చిపోయే పరిస్థితి ఉందన్నారు. ఈ సందర్భంగా సంస్థ పేరు పైన ఏర్పాటు చేసిన క్యాలెండరును ఆవిష్కరించారు. గాంధీ స్మారక నిధి అధ్యక్షులు కర్రోతు సత్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం లో ప్రధాన కార్యదర్శి మజ్జి కాంతారావు, ఉపాధ్యక్షులు ఏడిద వీర్రాజు, సుబ్బరాజు, షణ్ముఖ రావు, కృష్ణవేణి, రమణమ్మ, కొల్లి సత్యం, వెంకట రమణమూర్తి, బసవ మూర్తి, శ్రీరామ్మూర్తి, చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన

ప్రజాశక్తి-విజయనగరంకోట

రహదారి భద్రత నిబంధనలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవిశంకర్ ప్రసాద్ అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో రోడ్డు భద్రత పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రవిశంకర్ ప్రసాద్ మాట్లాడతూ రోడ్డు భద్రత నిబందనలను పాటిస్తే ప్రమాదాలను నియంత్రించవచ్చునని తెలిపారు. వాహనాలను నడిపే ప్రతి ఒక్కరూ తప్పకుండా లైసెన్సు కలిగి ఉండాలని, మద్యం సేవించి వాహనాలను నడపరాదని, అధిక స్పీడ్ తో ప్రయాణించకూడదని, పేర్కొన్నారు. కార్యక్రమం లో కళాశాల యాజమాన్యం, 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు,

ఆదిభట్ల వర్ధంతి

ప్రజాశక్తి-విజయనగరంకోట

హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు 81వ వర్ధంతి కార్యక్రమం ఆయన స్వగృహంలో ఆదిభట్ల ఫౌండేషన్ ఆనంద నారాయణ ఆధ్వర్యంలో జరిగాయి శు క్రవారం ఈ కార్యక్రమం లో ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి దాసు విగ్రహానికి పూలమాలతో నివాళులు అర్పించారు కార్యక్రమానికి లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జి, పి.భవాని హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాసు హరికథ రంగానికి ఎనలేని సేవలు అందించారని, హరికథ ద్వారా విజయనగర ఖ్యాతిని యావత్ ప్రపంచానికి తెలియజేసిన వ్యక్తి ఆదిభట్ల అని కొనియాడారు. ఆదిభట్ల వారసులు స్థాపించిన ఆదిభట్ల ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. అనంతరం ఫౌండేషన్ ప్రతినిధులను సత్కరించారు.

4న డ్యాన్స్ ఫెస్టివల్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఈనెల 4న ఆదివారం ఘంటసాల సంగీత సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో డాన్స్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నామని సమాఖ్య వ్యవస్థాపకులు సముద్రాల గురు ప్రసాద్ పేర్కొన్నారు .లంక వీధిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఉత్సవ ప్రతులను గేట్ అధ్యక్షురాలు పెనుమజ్జి విజయలక్ష్మితో కలిసి ఆవిష్కరించారు. ప్రముఖ నృత్య దర్శకుడు బెల్లాన రాజు కొరియోగ్రాఫర్ గా 20 ఏళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో గీతాంజలి పాఠశాలతో కలిపి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఉదయం 10 గంటల నుండ కెవెల్ పురం పావని నగర్ లో గల గీతాంజలి పాఠశాలలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో లాస్య డాన్స్ స్టూడియో అధినేత బెల్లాన రాజు ,గీతాంజలి విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎ.శ్రీనివాసరావు ,డైరెక్టర్ రాజేష్,ప్రిన్సిపల్ మల్లిక తదితరులు పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి- కంటోన్మెంట్

104 ఉద్యోగులు సమస్యలు పరిష్కరించేవరకు పోరాటాన్ని ఉధృతం చేయాలని పలుప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం సిఐటియు కార్యాలయంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు కె.సురేష్ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ భవ్య యాజమాన్యం 104 ఉద్యోగులకు తీవ్రమైన అన్యాయం చేస్తుందన్నారు. ఉద్యోగులకు సమస్యలు పరిష్కరించాలని యాజమాన్యానికి విన్నవించినా స్పందించడం లేదన్నారు. భవ్య యాజమాన్యం తగ్గించిన వేతనాలు సవరించి పూర్తి వేతనాలు చెల్లించాలని, దానితో పాటుగా ప్రభుత్వం కూడా జీతాలు పెంచే ఆలోచన చెయ్యాలని అన్నారు. 104 ఉద్యోగుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి. జగన్ మోహన్ మాట్లాడుతూ తొలగించిన క్యాజువల్ లీవ్‌లు పునరిద్ధరించాలని, అన్ని ప్రభుత్వ సెలవు 104 సిబ్బందికి కూడా వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు రామరాజు మాట్లాడుతూ తొలగించిన బఫర్ సిబ్బందిని తిరిగి నియమించి ఉద్యోగులపై పని ఒత్తిడి తగ్గించాలన్నారు. 104లో పనిచేస్తూ 5 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకున్న డ్రైవర్ లకు స్లాబ్ అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు. 104 డేటా ఎంట్రీ ఆపరేటర్‌లకు, ప్రభుత్వ ఔట్ సోర్సింగ్ సిబ్బందికిజీవో 7 ప్రకారం రూ.18500 వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. భవ్య యాజమాన్యాన్ని ప్రశ్నించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిపై అక్రమ సస్పెన్షన్ రద్దు చెయ్యాలి లేకపోతే ఉద్యమం మరింత తీవ్ర తరం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి, యూనియన్ అధ్యక్షులు అద్దేపల్లి రామరాజు, డివిజన్ నాయకులు కె.బంగారప్పాడు, బి.సంతోష్, ఎం.శ్రీనివాసరావు, గోవింద్, కృపారావు, కె.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న 104 ఉద్యోగుల యూనియన్ నాయకులు

రైతులకు అండగా ఉంటాం : ఎమ్మెల్యే అదితి

దుప్పాడలో పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరంకోట

రైతులకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాజముద్ర, రైతు ఫోటోతో ఉన్న పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని దుప్పాడ గ్రామంలో నిర్వహించారు. తొలుత విజయనగరం డిప్యూటీ తాహశీల్దార్ గాంధీ మాట్లాడుతూ విజయనగరం మండల పరిధిలో ఏడు గ్రామాలకు రీసర్వే పూర్తి చేసి 5434 పట్టాదారు పాస్ పుస్తకాలను సిద్ధం చేశామన్నారు. అయితే ఇందులో కొన్ని తప్పిదలాలు ఉండడంవల్ల 3280 పుస్తకాలను పంపిణీకి సిద్ధం చేశామన్నారు. దుపాడు గ్రామంలో 873 పాస్ పుస్తకాలు ఉండగా 427 పాస్ పుస్తకాలను సరిచేస్తూ పంపిణీ చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలను సరిచేసేందుకు రీ సర్వే చేశామన్నారు. ఇబ్బందులు లేని పట్టాదారు పాస్ పుస్తకాలను ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు ఒకవేళ ఏమైనా చిన్న చిన్న తప్పులు ఉంటే దరఖాస్తు చేసుకొని తమ దృష్టికి, తహశీల్దార్ దృష్టికి తీసుకొస్తే సరి చేస్తామన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా విత్తనాలు, ఎరువులను అందిస్తోంద న్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ఆర్ఎస్ఎస్ రాజు, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, పిఎసిఎస్ గాజులరేగ, జొన్నవలస చైర్మన్లు అప్పన్న బాబు, కోరాడ వెంకట్రావు, విజయనగరం మండల పార్టీ అధ్యక్షులు గంటా పోలినాయుడు, ప్రధాన కార్యదర్శి పాశి అప్పలనాయుడు, విజయనగరం పట్టణ పార్టీ అధ్యక్షులు గంటా రవి, విజయనగరం జిల్లా మాజీ అధ్యక్షులు ఐవిపి రాజు, జిల్లా గ్రంథాల సంస్థ మాజీ చైర్మన్, దుప్పాడ టిడిపి నాయకులు, వేచలపు శ్రీనివాసరావు, నడుపూరి రాంబాబు, చిలపేట బూర్లి కోదండరాం, సారిక కనకల రాంబాబు, గ్రామ సచివాలయ సిబ్బంది, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.



పట్టాదారు పాస్‌పుస్తకాలతో ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి, రైతులు, టిడిపి నాయకులు



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి, జెసి సేధుమాధవన్

9లోగా పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ

కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఈ నెల 9వ తేదీలోగా పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీని పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ట్రాన్స్‌పోర్ట్, ఆర్ అండ్ బి స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటి కృష్ణబాబు ఇతర ఉన్నతాధికారులు శుక్రవారం సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ప్రభుత్వ సేవలు- ప్రజాభిప్రాయం, రైల్వే మౌలిక సదుపాయాలు, భూసేకరణ తదితర అంశాలపై సమీక్షించారు. జిల్లా నుంచి కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి, జెసి సేధు మాధవన్, ఇతర అధికారులు పాల్గొన్నారు. విసి అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులకు పలు ఆదేశాలను జారీ చేశారు. ఈ నెల 9వ తేదీలోగా పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీని పూర్తిచేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. నియోజకవర్గస్థాయిలో కార్యక్రమాలను ఏర్పాటు చేసి, ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని సూచించారు. యునిఫైడ్ ఫ్యామిలీ సర్వే వేగంగా నిర్వహించాలని, ఈ నెల 12వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎరువుల పంపిణీలో రైతుల సంతృప్త స్థాయి మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని, యూరియా కొరత రానివ్వకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.

బ్యాడ్మింటన్ పోటీలకు 'సీతం' విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ పోటీలకు స్థానిక గాజుల రేగ పరిధిలో గల సీతం కళాశాలలో మొదటి సంవత్సరం బిటెక్ చదువుతున్న వై జస్వంత్ రెడ్డి ఎంపికయ్యాడు. జనవరి 1న రఘు ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఆంధ్ర యూనివర్సిటీ ఇండోర్ స్టేడియంలో జరిగిన అంతర్ కళాశాలల పురుషుల బ్యాడ్మింటన్ పోటీలలో అత్యుత్తమ నైపుణ్యం ప్రదర్శించి జెఎన్‌టియు గురజాడ జట్టుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డివి రామమూర్తి తెలిపారు ఈ పోటీలకు సుమారు 80 మంది క్రీడాకారులు పాల్గొన్నారు జెఎన్‌టియు జట్టు తరుపున జనవరి 3 నుండి 6వ తేదీలలో విజయవాడ కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో జరగబోయే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలలో పాల్గొంటారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థిని కళాశాల సంచాలకులు ఎం.శశిభూషణరావు తదితరులు అభినందించారు. ప్రొఫెసర్ డాక్టర్ కె.శ్రీలత, ఫిజికల్ డైరెక్టర్లు జె.మహేశ్వరరావు, టి.శ్రీదేవి, సిఎస్ఒ సత్యనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఖోఖో విజేతలకు అభినందనలు

డిసెంబరు 24 నుండి 26 వరకు గుడివాడలో జరిగిన సీనియర్ ఖోఖో రాష్ట్ర స్థాయి పోటీలలో జిల్లా పురుష జట్టు ద్వితీయ స్థానం సాధించింది. ఈ సందర్భంగా సత్యాడిగ్రీ కళాశాలో జరిగిన అభినందన సభ జరిగింది. ఈ సభకు కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశి భూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి సాయి దేవ మణి, భగవాన్ దాస్ ట్రస్ట్ కార్యదర్శి ఎ.రంగారావు దొర, చిన్నం నాయుడు, ఖోఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు, కమలనాభరావు, గోపాల్, కోచింగ్ క్యాంపు ఇన్చార్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.




ఖోఖో విజేతలను అభినందిస్తున్న సత్య కళాశాల అధ్యాపకులు

భూముంటే పట్టా కచ్చితంగా ఉండాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కురుపాం

రైతులకు భూముంటే కచ్చితంగా పట్టాలని, అప్పుడే ఆ భూమికి రైతు యజమాని అవుతాడని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని డి.బారామణిలో నిర్వహించిన పట్టాదారు పాసు పుస్తకం పంపిణీ కార్యక్రమం కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డితో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూమి ఉన్న ప్రతి ఒక్కరూ పట్టాదారు పాసుపుస్తకం చేయించుకోవాలని సూచించారు. ఇందులో భాగంగా దుంగల బారామణి గ్రామ రైతులు 106 మందికి పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేస్తామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతులు తాము దున్నే భూమిపై హక్కు కావాలంటే పట్టాదారు పాస్ బుక్‌లో రైతు పేరు ఉండాలని స్పష్టం చేశారు. రైతు ఎంత భూమి, ఎన్ని ఎకరాలు దున్నుతున్నారు అనేది చాలా ముఖ్యమని అన్నారు. కొంతమంది తండ్రి చనిపోయిన వారి పిల్లలు తమ పేరు పాసు పుస్తకంలో చేర్చకపోవడం వల్ల సమస్యలు వస్తాయని తెలిపారు. దానివల్ల అడంగల్, పాసు పుస్తకం, రెవిన్యూ రికార్డ్ లో భూమి హక్కుదారుని పేరు ఉండదన్నారు. పాసు పుస్తకంలో పేరు లేకపోతే ఆ భూమి వేరే ఎవరైనా ఆక్రమించుకుని అమ్మేసుకుంటే ఇబ్బందులు పడతారని కలెక్టర్ పేర్కొన్నారు. భూమి విలువ పెరిగే కొద్దీ మోసాలు కూడా పెరుగుతాయని జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పాసు పుస్తకం కచ్చితంగా ఉండాలన్నారు. మొబైల్ ఫోన్ వాట్సాప్ లో



రైతుకు పాసుపుస్తకం అందజేస్తున్న ఎమ్మెల్యే

రెవెన్యూ రికార్డులే ప్రామాణికం : కలెక్టర్

మన మిత్ర అనే యాప్ రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని, మీ సేవ ద్వారా జరిగే పనులన్నీ మన మిత్ర ద్వారా జరుగుతాయని, రైతులు తమ పట్టాదారు పాస్ పుస్తకం మన మిత్ర ద్వారా డౌన్లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ కొత్త టెక్నాలజీతో ఎవరూ ఎవ్వరు ఎవరి భూమిని ఆక్రమించుకోలేరని చెప్పారు. కార్యక్రమంలో పాలకొండ సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ, తహశీల్దార్ కె.జయ, ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి, స్థానిక సర్పంచ్ హెచ్ నాగేశ్వరరావు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అలాగే మండలంలోని బియ్యాలవలస పంచాయతీ పెళ్లివలసలో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ కె.జయ, తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజ్, ఎంపిడిఒ ఉమామహేశ్వరి, పిఎసిఎస్ చైర్మన్ డొల్లు కిషోర్ కుమార్, అధికారులు, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని దయానిధిపురం పంచాయతీ పూనుబుచ్చంపేటలో పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు పార్వతీపురం ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా ఇస్తున్న పట్టాదారు పాస్‌పుస్తకాల్లో భూ విస్తీర్ణం భూమికి సంబంధించి మ్యాప్, భద్రత కోసం క్యూఆర్ కోడ్ వంటి ప్రత్యేకతలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తెంటు రామారావు, మండల టిడిపి అధ్యక్ష కార్యదర్శులు పి.సత్యంనాయుడు, వేణుగోపాల్ నాయుడు, మండల నాయకులు కె.అరవింద్ కుమార్‌నాయుడు, బి.శంకర్రావు, కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ గొట్టాపు వెంకట నాయుడు, తహశీల్దార్ జె.ప్రసన్నకుమార్, ఆర్ఐ ఎం.శ్రీనివాసరావు, డిటి వి.ఉమామహేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది, వివిధ గ్రామాల నాయకులు, రైతులు



రైతుకు పట్టాదారు పుస్తకం అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

పాల్గొన్నారు

కొమరాడ : మండలంలోని గుమడలో రైతులకు భూహక్కు పత్రాలను, పాస్ పుస్తకాలను తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 29 గ్రామాల్లో గతంలో ప్రభుత్వం రీసర్వే ప్రక్రియ పూర్తి చేసిందని తెలిపారు. పట్టాదారు పాస్ పుస్తకాల్లో తప్పిదాలు ఉంటే రెవెన్యూ శాఖ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కురుపాం ఎఎంసి డైరెక్టర్ నీరస శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, రైతులు, పాల్గొన్నారు.

భామిని : మండలంలోని పకుడిభద్ర, బొమ్మిక, కాట్రగాఢ -బి పరిధిలో గల రెవెన్యూ గ్రామాలకు చేపట్టిన రీసర్వే ఆధారంగా ప్రభుత్వ రాజముద్రతతో వచ్చిన పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు స్థానిక తహశీల్దార్ శివన్నారాయణ అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిపి ప్రతినిధి తోట సింహాచలం అప్పుడే సచివాలయంలోకి సర్వేయర్ అసిస్టెంట్ల చిన్న చిన్న పొరపాట్లు వల్ల పాస్‌బుక్‌లోని భూ వివరాలు పూర్తి స్థాయిలో లేవని అన్నారు. ఇటువంటి అంశాలు పరిష్కరించి, భూ హక్కు దారులకు న్యాయం చేయాలని తహశీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ మణి ప్రభాకర్, సర్పంచ్ కేశవ, రైతులు పాల్గొన్నారు.

పరిశుభ్రతే ఆరోగ్యానికి రక్ష : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - కురుపాం



గవరంపేటలో వీధి కాలువను పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

వ్యాధులు ప్రభల కుండా ఉండేందుకు వ్యక్తిగత శుభ్రతతో పాటు మన చుట్టూ ఉన్న పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, పరిశుభ్రత తోనే ఆరోగ్యానికి రక్షణ ఉంటుందని జిల్లా వైద్యా రోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు పేర్కొన్నారు. జియ్యమ్మవలస పిహెచ్‌సి పరిధిలో గల గవరంపేట గ్రామాన్ని శుక్రవారం ఆకస్మికంగా సందర్శించి గ్రామంలో ఫ్రైడే డ్రైడే నిర్వహణ పరిశీలించారు. ఇంటి పరిసరాల్లో, కాల్వల్లో నీరు నిల్వ లేకుండా పర్యవేక్షణ ఉండాలని, పరిసరాల పరిశుభ్రతలో అందర్నీ భాగస్వాములు చేస్తూ గ్రామాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలన్నారు. వెక్టార్ కంట్రోల్ హైజీన్ యాప్ తనిఖీ చేసి గ్రామంలో గుర్తించిన, చర్యలు చేపట్టిన దోమల లార్వా ప్రభావిత ప్రదేశాలపై వైద్య, పంచాయతీ సిబ్బందిని ఆరా తీశారు. అక్కడ సంచార చికిత్సా వైద్య శిబిరాన్ని పరిశీలించి రోగులకు అందుతున్న సేవలను వారిని అడిగి తెలుసుకున్నారు. గర్భిణుల వైద్య పరీక్షల వివరాలు ఎంసిపి కార్డులో పూర్తిగా నమోదు చేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఆరోగ్య సర్వే, స్క్రీనింగ్ ప్రక్రియపై పరిశీలించారు. మెరుగైన ఆరోగ్య అంశాలపై ఎప్పటికప్పుడు ప్రజల్లో అవగాహన కల్పించాలని, ముస్తాబు కార్యక్రమం పిల్లలు, విద్యార్థులతో పాటు ప్రతి ఇంటిలో ఆచరించేలా అవగాహన కల్పించాలని, వ్యాధుల నియంత్రణలో ఎంతగానో దోహదపడుతుందని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యానికి రక్షణ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎన్‌సిడి అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు, డిపిఎంఒ డాక్టర్ రఘు కుమార్, డిబిసిఎస్ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ సూర్య కౌశిక్, వైద్యాధికారి డాక్టర్ పి.జగదీష్, పంచాయతీ సెక్రటరీ ఎ.మోహన్ రావు, వైద్య సిబ్బంది సునీత, ఈశ్వరమ్మ, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కంబరలో వైద్య శిబిరం

వీరఘట్టం: మండలం కంబరలో శుక్రవారం స్థానిక వైద్యాధికారి బి ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, గర్భిణులు, చిన్నారులు, బాలింతలు రకరకాలైన రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్, ఎంఎల్‌హెచ్పి, ఎఎన్ఎం, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు ,పాల్గొన్నారు.

జంఝావతి కోసం రైతులంతా ఏకమవ్వాలి

గుణానుపురంలో పర్యటించిన సాధన సమితి ప్రతినిధులు

ప్రజాశక్తి - కొమరాడ

జంఝావతి సాధన కోసం రైతులంతా ఏకమవ్వాలని జంఝావతి సాధన సమితి ప్రధాన కార్యదర్శి పల్లి రాజగోపాలనాయుడు పిలుపునిచ్చారు. సమితి కార్యనిర్వాహక కన్వీనర్లు మరిశర్ల మాలతీ కృష్ణమూర్తి నాయుడు, వంగల దాలినాయుడు, చుక్క చంద్రరావు తదితరులతో కలిసి మండలంలోని జంఝావతి బాధిత గ్రామమైన గుణానుపురంలో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయకట్టు రైతులతో సమావేశమయ్యారు. ఆంధ్రా, ఒడిశాతో పాటు కేంద్రంలో అనుకూల ప్రభుత్వాలు ఉన్నాయని, ఎల్లవేళలా పాలకులు, అధికారులు రైతులకు ఒడిశా వివాదమనే భూతాన్ని చూపి గత 50 ఏళ్లుగా జంఝావతిని ఎన్నికల హామీలకే పరిమితం చేశారన్నారు. ఇప్పుడు పాలకులు, అధికారులు దిగి రావాలంటే రైతులంతా ఏకమవ్వాలన్నారు. మండలంలో జంఝావతి బాధిత గ్రామాల్లో ఆయకట్టు రైతులతో గ్రామ కమిటీలు పూర్తయ్యాయన్నారు. మిగతా మండలాల్లో గ్రామ కమిటీలు పూర్తయ్యాక జంఝావతిని పూర్తిచేయాలని కోరుతూ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని తెలిపారు. ఇందుకు రైతులంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని సీతానగరం పిఎసిఎస్ పరిధిలోని రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్.అవినాష్ మాట్లాడుతూ మండలంలోని అన్ని ఆర్ఎస్‌కె పరిధిలో యూరియా అందుబాటులో ఉందని, ఎక్కడా కొరత లేదని అన్నారు. సీతానగరం పిఎసిఎస్ పరిధిలో 444 బస్తాలు యూరియా అందుబాటులో ఉన్నాయని, అలాగే బూర్జ ఆర్ఎస్‌కెలో 170 బస్తాలు, పెదంకాలంలో 222 బస్తాలు, దయానిధిపురంలో 444 బస్తాలు, నిడగల్లులో 175 బస్తాలు, తామరకండిలో 180 బస్తాలు, గ్రోమోర్‌లో 120 బస్తాలు, బూర్జలోని విజయరామ ఫర్టిలైజర్ వద్ద 66 బస్తాలు యూరియా అందుబాటులో ఉందన్నారు. మొక్కజొన్న, వరి వేసిన రైతులకు ఎరువులు అందిస్తున్నామని తెలిపారు. వీటితో పాటు చినభోగిలి, కె.వెంకటాపురం గ్రామాలకు ఇండెంట్‌లు పెట్టామని, కావున యూరియా కొరత ఎక్కడా లేదని తెలిపారు. కార్యక్రమంలో రైతులు, పిఎసిఎస్ సిబ్బంది, విఏఒలు పాల్గొన్నారు.



చంద్రమౌళికి సర్టిఫికెట్‌ను అందజేస్తున్న జడ్జి బబిత

చంద్రమౌళికి సర్టిఫికెట్ అందజేత

ప్రజాశక్తి - కురుపాం

జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన 40 గంటల మధ్యవర్తిత్వ శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన కురుపాం కోర్టు న్యాయవాది బరాటం చంద్రమౌళికి సర్టిఫికెట్ ప్రదానం చేశారు. శుక్రవారం విజయనగరం జిల్లా కోర్టులో జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షిదారుల మధ్య రాజీ కుదర్చేందుకు తన వంతు సేవ చేస్తానని అన్నారు .

పిఎం- ఆర్‌కెవివై కింద రైతులకు శిక్షణ

ప్రజాశక్తి - పాచిపెంట

రైతులు మేలైన యాజమాన్య పద్ధతులను పాటించి ఖర్చులు తగ్గించుకుంటూ అధిక దిగుబడులు సాధించాలని మన్యం జిల్లా వనరుల కేంద్రం ఎడిఎ బి.శారద అన్నారు. పిఎంఆర్‌కెవై కింద రైతులకు రబీ పంటల్లో మేలైన యాజమాన్య పద్ధతులపై పి.కోనవలస రైతు సేవా కేంద్రంలో రైతులకు శిక్షణ అందించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బహుళ పంటలు వేసుకోవాలని, విచక్షణారహితంగా యూరియాను వాడొద్దని, పొటాష్ ఎరువులు తప్పనిసరిగా విత్తనం వేసేటప్పుడు చిరుపొట్ట దశ లేదా వివిధ పంటల్లో పూత లేదా పిందే దశలో రెండుసార్లు వేసుకోవాలని సూచించారు. అనంతరం 40 మంది రైతులకు ఉచితంగా ట్రైకోడెర్మా విరిడి అందించారు. మొక్కజొన్న, వేరుశెనగ, నువ్వులు వంటి అనేక పంటలకు ట్రైకోడెర్మాను 200 కిలోల పశువుల పెంటల్లో కలిపి పలుచగా నీళ్లు చిలకరించి నీడలో గోనె సంచి కప్పి ఉంచాలని కొద్ది రోజుల తర్వాత మొత్తం పశువుల గత్తము అంతా ట్రైకోడెర్మా నిండి ఉంటుందని, దాన్ని పంట పొలాలలో చల్లుకుంటే వేరు కుళ్లు తెగుళ్ల నివారణ జరుగుతుందని తెలిపారు. అనంతరం రస్తాకుంటుబాయి కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త జి.అమృతవీణ రైతులకు వివిధ పంటలపై ఆశించే పురుగులు, తెగుళ్ల నివారణ గురించి వివరించారు. అనంతరం బాగా స్పందించిన రైతులకు సర్టిఫికెట్లు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు, ఎఇఒ నాగమణి, విఎఎ లావణ్య, రైతులు పాల్గొన్నారు.

కేదారిపురంలో ముస్తాబు

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని కేదారిపురంలో గ్రామ ముస్తాబు కార్యక్రమంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా గ్రామం రోడ్డు కిరువైపులా ఉన్న పిచ్చి మొక్కలు, చెత్త కుప్పలను బ్లేడ్ ట్రాక్టర్ ద్వారా తొలగించి పరిశుభ్ర పరిచారు. రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటడానికి గోతులుతీశారు. స్పెషల్ ఆఫీస్ బి.చంద్రశేఖర రావు ఆధ్వర్యంలో కేదారిపురంలో డ్రై డే, ఫ్రైడే నిర్వహించి ప్రజలకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పైన అవగాహన కల్పించారు.

రోడ్డును బాగు చేయండి : సిపిఎం

సీతంపేట :మండలంలోని మర్రిపాడు పంచాయతీ ఎగువ దారబందకు వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉందని, తక్షణమే ఈ రోడ్డును పూర్తి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు ఎం.తిరుపతిరావు డిమాండ్ చేశారు. ఈ రోడ్డు పాడైపోవడంతో గ్రామస్తులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాలకులు, అధికారులు గిరిజన గ్రామాల్లో డోలీ మోతలు లేకుండా చేస్తామని ప్రకటనలకే పరిమితమయ్యారు తప్ప ఆచరణలో అమలు కావడంలేదని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ఉపముఖ్య మంత్రి గిరిజన ప్రాంతంపై దృష్టి సారించాలన్నారు. అలాగే పాలకొండ ఎమ్మెల్యే కూడా స్పందించి ఈ రోడ్డును మరమ్మతు చేయాలని డిమాండ్ చేశారు.



అధ్వానంగా ఉన్న ఎగువదారబంద రోడ్డు

అధికారుల తీరుపై స్టాండింగ్ కమిటీ ఆగ్రహం

- మా సహకారం వల్లే విజిలెన్స్ విచారణ జరగలేదు
- సహనాన్ని పరీక్షించవద్దు
- స్టాండింగ్ కమిటీ సమావేశం ఫ్లోర్ లీడర్ రాజేష్
- 22 అంశాలతో ఎజెండాను ఆమోదించిన స్టాండింగ్ కమిటీ



సమావేశం నుంచి బయటకు వెళ్లిపోతున్న మేయర్, ఫ్లోర్‌లీడర్, సభ్యులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

'మా పాలకవర్గంలో అధికారులను అన్నదమ్ముల్లా భావించి పని చేశాం, ఏ రోజూ మిమ్మల్ని ఇబ్బంది పెట్టలేదు. మీకు అన్ని విధాలా సహకరించాం. కాబట్టి జిల్లాలో అన్ని మున్సిపాల్టీల్లో విజిలెన్స్ విచారణలు జరిగినా విజయనగరంలో జరగలేదు. మా సహనాన్ని పరీక్షించవద్దు. అలా అయితే మేమేంటో చూపిస్తాం, మీరు నగర పాలక సంస్థకు సంబంధం లేని వ్యక్తుల దగ్గరికి వెళ్లి కూర్చొని వారు చెప్పినట్లు నడిస్తే మాకు నగర పాలక సంస్థలో చట్టాలు తెలుసు. తగిన చర్యలు తప్పవు' అంటూ నగర పాలక సంస్థ ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్ అధికారులు తీరుపై మండిపడ్డారు. శుక్రవారం నగర పాలకసంస్థ స్టాండింగ్ కమిటీ సమావేశం మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఫ్లోర్‌లీడర్ రాజేష్ మాట్లాడుతూ బడ్జెట్లో కేటాయింపులు ఎలా చేశారు? నాలుగేళ్లలో ఎన్ని కోట్లు ఖర్చు పెట్టారు? సాధారణ నిధులు ఎంత? దానిలో ఖర్చు చేసింది ఎంత? స్టాంప్ డ్యూటీ ద్వారా వచ్చింది? ఎ ఎమ్మెల్యే, ఎంపీ నగర పాలక సంస్థకు ఎన్ని నిధులు తెచ్చారు? అని ప్రశ్నిస్తూ ఆ లెక్కలు చెప్పేవరకు సమావేశం జరగదంటూ మేయర్ విజయలక్ష్మి, కమిటీ సభ్యులు బాబు, చాణక్య, రంగా, రూపాదేవితో కలసి సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు. సభ్యులను కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ వారించారు. అర గంట తరువాత వారంతా రావడంతో సమావేశం కొనసాగించారు. సమావేశంలో సభ్యులు అడిగిన వివరాలు అకౌంట్ విభాగం సిబ్బంది కమిటీ ముందు ఉంచారు. ఈఏడాది మొత్తం రోడ్లకు బడ్జెట్లో రూ.9.83 కోట్లు కేటాయిస్తే వాటిలో రూ.3.96కోట్లతో పనులు జరుగుతున్నాయని తెలిపారు. కాలువలు, కల్వర్టులకు బడ్జెట్లో రూ.5కోట్లు కేటాయించగా రూ.153 లక్షలు ఖర్చు చేశామన్నారు. విద్యుత్ స్తంభాలకు కోటి రూపాయలు కేటాయించగా రూ.26.64 లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు. మొత్తం కేటాయింపులు రూ.53.29 కోట్లకు గాను, రూ.10.23 కోట్లు ఖర్చు చేశామన్నారు. స్టాండింగ్ కమిటీలో 22 అంశాలతో కూడిన అభివృద్ధి పనులకు కమిటీ ఆమోదం తెలిపింది. ఎజెండాలోని అంశాలపై చర్చ జరిగిన సమయంలో ఇన్ని డబ్బులు ఉంచుకొని అభివృద్ధి పనులు చేయాలని మేయర్ లెటర్ పెడితే ప్రభుత్వం డబ్బులు ఖర్చు చేయొద్దని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇన్నిడబ్బులున్నా కాంట్రాక్టర్లకు బకాయిలు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. బి పి ఎస్ నిధులు నాలుగు కోట్లు ఉన్నాయని, వాటి ద్వారా చెల్లింపులు ఎందుకు చేయరని రాజేష్ ప్రశ్నించారు. ఇన్‌స్పెక్టర్లు రామారావు, రమేష్ వారికి ఇస్తున్న సున్నం ,అన్ని రకాలు వస్తువులు అమ్ముకుంటున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. హెల్త్ సెక్షన్ బార్ అండ్ రెస్టారెంట్ లా ఉందని, సెక్షన్ హెడ్‌లు ఏమి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయం అడ్మిన్లు అవినీతి పరుల్గా మారారని, జనాలను పీడిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అనంతరం సమావేశంలో 22అంశాలతో కూడిన ఎజెండాను ఆమోదించారు. సభ్యులు రాజేష్, సుంకరి బాబు, రంగా, రూపాదేవి, అల్లు చాణక్య, కమిషనర్ నల్లనయ్య, అసిస్టెంట్ కమిషనర్ అప్పలరాజు, అధికారులు పాల్గొన్నారు.

బకాయి జీతాలు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి - పాలకొండ

నగర పంచాయతీ పనిచేస్తున్న పారిశుధ్యం, ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న 87 మంది కార్మికులకు చెల్లించాల్సిన మూడు నెలలు వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ నగర పంచాయతీ గౌరవ అధ్యక్షులు దావాల రమణారావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండగ రోజు కార్మికులు పస్తుల్లేకుండా చూడాలని, తక్షణమే మూడు నెలల వేతన బకాయిలు చెల్లింపునకు చర్యలు చేపట్టాలన్నారు. నగర పంచాయతీ పాలకవర్గానికి కూడా దృష్టి పెట్టాలన్నారు. అధికారి యంత్రంగా నిర్లక్ష్యం ప్రభుత్వ విధానాలు ఫలితంగా జీతాలు చెల్లింపులో జాప్యం జరుగుతుందన్నారు. ప్రజల ఆరోగ్యం కాపాడే కార్మికులకు నెలవారీ వేతనాలు చెల్లించకపోవడం దురదృష్టకరమన్నారు. దసరా ఉత్సవాల్లో పనిచేసిన కార్మికులు 13 మందికి నేటికీ వేతనాలు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. యూనిఫారం, సబ్బులు, నూనె తక్షణమే ఇవ్వాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే మెరుపు సమ్మెకు సిద్ధమవుతామని అన్నారు. కార్యక్రమంలో చింతల సంజీవి, పడాల వేణు, విమల, శ్రీదేవి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి క్రికెట్ టాలెంట్ హంట్ ఎంపిక పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆంధ్రా క్రికెట్ ఆసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6, 7 తేదీల్లో జిల్లా కేంద్రంలోని విజ్జి క్రికెట్ మైదానంలో టాలెంట్ హంట్ ఎంపికలు నిర్వహిస్తామనిజిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి పి. సీతారామరాజు శుక్రవారం తెలిపారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధి, టాలెంట్ హంట్ సభ్యులు ఆర్. విష్ణువర్ధన్ రెడ్డి పర్యవేక్షణలో ఈనెల 6నుంచి రెండు రోజులపాటు ఎంపిక పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. అండర్-14 విభాగంలో నిర్వహించే టాలెంట్ హంట్ పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు ఒకరోజు ముందుగా తమ పేరును రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. పోటీలకు హాజరయ్యే సమయంలో ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్, పాస్పోర్ట్ సైజ్ ఫోటో, జనన ధ్రువీకరణ పత్రం తీసుకురావాలని కోరారు. సొంత కిట్టు, తెలుపు రంగు దుస్తులు ధరించి రావాలని ఆయన కోరారు. ఎసిఎ ఆధ్వర్యంలో గతంలో నిర్వహించిన జిల్లా, ఆపై స్థాయి పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు ఈ ఎంపిక పోటీలకు అనర్హులని ఆయన పేర్కొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల కరస్పాండెంట్ ఉమా

తైక్వాండోలో సత్తా చాటిన ఆదిత్య స్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 27, 28 తేదీల్లో గుంటూరు జిల్లాలో జరిగిన 2వ ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ కప్ తైక్వాండో ఛాంపియన్‌షిప్ మినీ సబ్ జూనియర్, సబ్ జూనియర్స్, క్యాడెట్, జూనియర్ సీనియర్ విభాగంలో 310 మంది పాల్గొన్నారు, విజయ నగరానికి చెందిన శ్రీ ఆదిత్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ నుంచి మొత్తం 10 మంది విద్యార్థులు పాల్గొని సత్తా చాటారు. సబ్ జూనియర్ విభాగంలో ఉన్నత, కార్తికేయ గోల్డ్ మెడల్ సాధించారు. సబ్ జూనియర్ విభాగంలో నికిత్ గోల్డ్ మెడల్, వై.రిషిత, సిల్వర్ మోడల్ సిహెచ్ యశస్విని బ్రాంజ్ మెడల్ సాధించారు. క్యాడెట్ విభాగంలో ఎస్‌డి సహన్వాజ్, సోఫియాన్, జి.పూజిత, కె.సందీప్ గోల్డు మెడల్స్ సాధించారు. ఎ.వెంకటలక్ష్మి, సిహెచ్ పవన్‌సాయి, సిల్వర్ మెడల్స్ సాధించారు. వీరిలో గోల్డ్ మెడల్ సాధించిన ఆరుగురు ఈనెల 18నుంచి 23వరకు జైపూర్‌లో జరుగనున్న జాతీయ స్థాయి పోటీకలు ఎంపికయ్యారు. వీరిని స్కూలు కరస్పాండెంట్ ఉమా నాయుడు అభినందించారు.

పరిశ్రమలకు అనుమతుల్లో జాప్యం వద్దు : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేయడమే లక్ష్యంగా, పరిశ్రమల స్థాపనకు వచ్చే దరఖాస్తులను నిబంధనల మేరకు అత్యంత వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా పరిశ్రమల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశ్రామికవేత్తలు దరఖాస్తు చేసుకున్న తర్వాత చట్టబద్ధమైన గడువు ముగిసే వరకు వేచి చూడకుండా, వెంటనే వాటిని పరిశీలించి అనుమతులు మంజూరు చేయాలని స్పష్టం చేశారు. ఏదైనా శాఖ వద్ద అనుమతులు పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తిస్తే, పరిశ్రమల శాఖ అధికారులు తక్షణమే స్పందించి ఆయా శాఖలతో సమన్వయం చేసుకొని సమస్యను పరిష్కరించాలని సూచించారు. జిల్లాకు వచ్చే పారిశ్రామిక వేత్తలకు జిల్లా యంత్రాంగం తరపున సంపూర్ణ సహకారం అందిస్తామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లాలో కొత్తగా ఏర్పాటు కానున్న 8 ప్రధాన పరిశ్రమల పురోగతిపై ఆయన ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. సూపర్ స్మెల్టర్స్ లిమిటెడ్, స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా లిమిటెడ్, స్టీల్ ఎక్స్ఛేంజ్ ఎన్‌ఫ్రా లాజిస్టిక్స్ లిమిటెడ్, అన్నుమి స్పేస్ కార్పొరేషన్, జెఎస్‌డబ్ల్యు ఇండస్ట్రీస్ పార్క్ లిమిటెడ్, వైశాఖి గ్రోత్ కారిడార్, రుషిల్ డెకర్స్, ఎలైట్లాజిక్స్ ఎగ్జిమ్ ఏజెన్సీ ఇండియా లిమిటెడ్ వంటి కంపెనీలు జిల్లాలో తమ యూనిట్లను స్థాపించేందుకు ముందుకు వచ్చాయని, వీటి ద్వారా పెద్ద ఎత్తున స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు.